www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
17-07-2024
సంపుటి : 01 | సంచిక : 74 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS



## రుణమాఫీ కావాలంటే రైతులు అప్పులు చేయాలా?

### హామీ ఇచ్చింది ఒకటి అమలు చేస్తుంది మరొకటి

- రేషన్‌కార్డు నిబంధన లక్షలాది రైతుల ఆశలపై నీళ్లు చల్లడమే
- స్వల్పకాలిక పంట రుణాలకు వర్తిస్తుందనడం దారుణం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



**విశ్వంభర , హైదరాబాద్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన పంటల రుణమాఫీ మార్గదర్శకాలపై మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రెండు లక్షలకు పైగా అప్పున్న రైతులు, ఆ అప్పును కడితేనే రుణమాఫీ చేస్తం అంటున్నారు. అంటే అప్పు మాఫీ కోసం బయట మూడు రూపాయలకు మళ్లా అప్పు తెచ్చుకునే పరిస్థితి. అప్పు కట్టేందుకు అప్పు తెచ్చుకో అన్నట్లుంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అసెంబ్లీలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ రైతుకు అప్పు ఎప్పుడు పుట్టాలి..? ఎప్పుడు కట్టాలి..? ఎప్పుడు మీరు జమ చేయాలి..? ఎంత ఆలస్యం జరుగుతుందో తెలుసా..? ఇలాంటి షరతులు అవసరం లేదు. మీరు ఇచ్చే రెండు లక్షల రుణమాఫీ చేయాలి. ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు మిగతా3లో...



> పంట రుణాల మాఫీ విషయంలో రేషన్‌కార్డు నిబంధనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. భూమి పాస్‌బుక్ ఆధారంగానే రూ.2లక్షల రుణమాఫీ ఉంటుందని వెల్లడించారు. కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు నిబంధన పెట్టినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సచివాలయంలో కలెక్టర్ల సమీక్షా సమావేశంలో రుణమాఫీ మార్గదర్శకాలపై సీఎం వివరించారు.

### ఈ నెల 18న రూ.లక్ష వరకు రుణమాఫీ

పాస్ బుక్ ఆధారంగానే రైతు రుణమాఫీ

# రుణమాఫీకి ముహూర్తం ఖరారు

### కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్ కార్డు నిబంధన

రేపు సాయంత్రానికల్లా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ

వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి

రుణమాఫీ సంబరాల్లో పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

**విశ్వంభర, హైదరాబాద్ :**

ఎల్లుండి సాయంత్రంలోపు రైతుల ఖాతాల్లో రూ.లక్ష వరకు డబ్బులు జమ కానున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. ఈనెల 18న రైతు వేదికల్లో రుణమాఫీ లబ్ధిదారులతో సంబురాలు ఉంటాయన్నారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ మిగతా2లో...



### జిల్లాకో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం

ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యం

సంక్షేమం, అభివృద్ధి రెండింటిపై దృష్టి పెట్టాలి.

జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

బీఆర్ఎస్ నేతలకు ప్రోటోకాల్‌పై

## మాట్లాడే అర్హత లేదు

- ప్రోటోకాల్ లేకుండా కొందరు బతకలేకపోతున్నారు
- మాజీ మంత్రి సబితారెడ్డికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చాం
- ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమానికి ఈటల తెరలేపారు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం




2

## సుప్రీం కోర్టు తీర్పుపై కేసీఆర్ భుజాలు తడుముకుంటుండు

- టెక్నీకల్ పాయింట్స్ పైనే జడ్జిని మార్చి కొత్త జడ్జితో విచారణ చేయమన్నది
- పింకీ తమ్ముళ్లు సంబరపడకండి .. జడ్జిమెంట్ ను తెలుసుకోండి
- తప్పు చేయకుంటే విచారణ కమిషన్ ముందు హాజరుకావొచ్చుగా
- తప్పు చేయనప్పుడు ఎందుకు కల్వకుంట్ల కుటుంబంలో కలవరం
- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్




2

## తిహార్ జైలులో కవితకు అస్వస్థత..

- హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు
- దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆసుపత్రిలో చికిత్స
- కవితకు తీవ్రమైన జ్వరం, గైనిక్ సమస్యలు
- చికిత్స అనంతరం జైలుకు తరలింపు




2



## నేడు స్కూలు, కాలేజీలకు సెలవు

- తొలి ఏకాదశి, మొహర్రం సందర్భంగా ..
- ప్రకటించిన తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## జ్యుడీషియల్ కమిషన్‌ను రద్దు చేయలేం..

### కానీ కమిషన్ జడ్జిని మార్చే అవకాశం ఇస్తున్నాం



- విచారణ సమయంలో ప్రెస్‌మీట్ పెట్టడం సరికాదు
- జ్యుడీషియల్ కాదు.. విచారణ కమిషన్‌గా పిలవండి
- విచారణ కమిషన్‌కు కొత్త జడ్జిని నియమించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

**విశ్వంభర, ఢిల్లీ:** విద్యుత్ కొనుగోళ్లపై జ్యుడీషియల్ కమిషన్‌ను రద్దు చేయాలంటూ కేసీఆర్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. అయితే, విచారణలో కీలక వ్యాఖ్యలు చేశారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్. విచారణ జరుగుతుండగానే.. జూన్ 11న కమిషన్ చైర్మన్ జస్టిస్ నర్సింహా రెడ్డి ప్రెస్ మీట్ పెట్టడంపై సీజేఐ అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిషన్ విచారణ ఇంకా పూర్తికాక ముందే, కమిషన్ తన అభిప్రాయం చెప్పడం కరెక్టు కాదంది సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. విచారణ పూర్తికాక ముందే జస్టిస్ నర్సింహారెడ్డి ఒక మిగతా3లో...



## ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఫైట్

- అసెంబ్లీ స్పీకర్‌ను బీఆర్ఎస్ నేతల బృందం
- పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయాలని ఫిర్యాదు
- పార్టీ ఫిరాయించేవారిపై వేటు వేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉందన్న కేటీఆర్
- సుప్రీంకోర్టు తీర్పును స్పీకర్ కు చదివి వినిపించామని వెల్లడి

**విశ్వంభర, హైదరాబాద్ :**

నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు, పార్టీ ఫిరాయింపులపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ నేతల బృందం ఫిర్యాదు చేసింది. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ తరపున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని... ఫిరాయింపులపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్పీకర్ దృష్టికి తీసుకొచ్చామని చెప్పారు. పార్టీ ఫిరాయింపులపై మిగతా2లో...



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 108 | ₹ 131 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 190 | ₹ 216 |

## అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్

- టీచర్‌కు రూ.2లక్షలు, ఆయాకు రూ.లక్ష
- ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన ప్రభుత్వం
- అధికారిక జీవో విడుదల చేస్తామని సీతక్క హామీ
- ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకున్న మంత్రి



**విశ్వంభర, హైదరాబాద్:** అంగన్వాడీ టీచర్లకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని చెబుతోన్న కాంగ్రెస్ మిగతా3లో...

## సుప్రీం కోర్టు తీర్పుపై స్పందించిన జస్టిస్ నరసింహారెడ్డి

- కమిషన్ అంటేనే ఓపెన్ ఎంక్వయిరీ
- ఇప్పటి వరకు ప్రతి కమిషన్ ప్రెస్ మీట్ పెట్టింది
- తాను ప్రెస్‌మీట్‌లో ఎలాంటి అంశాలను బయటపెట్టలేదు
- సుప్రీంకోర్టు తీర్పుపై జస్టిస్ నరసింహారెడ్డి



2

## ప్రేమోన్మాది దాడిలో గాయపడిన అన్నాచెల్లెలికి కేటీఆర్ అండ

- పార్టీ తరపున రూ.5 లక్షలతో పాటు పిల్లలిద్దరీ చదువు బాధ్యత
- ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని విజ్ఞప్తి
- నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్



2

## రుణమాఫీకి ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)
చేసినట్లు సమావేశంలో వెల్లడించారు. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఇతర ఖాతాల్లో జమ చేసుకుంటే బ్యాంకర్ల పైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో పంట రుణమాఫీకి కాంగ్రెస్ సర్కార్ మార్గదర్శకాలను విడుదల చేసింది. పథకం అమలు విధి విధానాలను వివరిస్తూ సోమవారం ఆర్డర్స్ (జీవో ఆర్టీ నంబరు 567) జారీ చేసింది. ఒక రైతు కుటుంబానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసేందుకు నిశ్చయించుకుంది. రైతు కుటుంబం గుర్తింపునకు తెల్లరేషన్ కార్డును కంపల్సరీగా తీసుకోనున్నట్లు ప్రకటించింది.

**విపక్షాల విమర్శలపై సీఎం స్పష్టత :**
అన్ని షెడ్యూల్డు, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా కోపరేటివ్ బ్యాంకుల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువలైన రుణాలకు, 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట లోన్స్‌కు, స్వల్పకాలిక రుణాలకు ఇది వర్తిస్తుందని రుణాల అసలు, దానికి వర్తించే వడ్డీని కలిపి రూ.2 లక్షలు మాఫీ అవుతాయని రేవంత్ సర్కార్ తెలిపింది. అయితే తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించటంతో విపక్ష పార్టీల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రేషన్ కార్డు నిబంధనపై ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చారు. అన్నం పెట్టే రైతును అప్పుల ఊబి నుంచి ఆశల సాగు క్షేత్రం వైపు నడిపించే బృహత్తర సాహసమే రైతు రుణమాఫీ పథకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నాడు మన్మోహన్ సింగ్ సారథ్యంలో దేశ రైతాంగానికి ఘనత కాంగ్రెస్ పార్టీదేనని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పాలనలో తెలంగాణ రైతాంగానికి, కష్టమైనా భారమైనా ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి, ఆగష్టు 15 లోపు 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రతి నిర్ణయంలో రైతు సంక్షేమ కోణం ఉంటుందని, ఇది రైతన్నకు మీ రేవంతన్న మాట అంటూ సీఎం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## బీఆర్ఎస్ నేతలకు ప్రోటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదు

**విశ్వంభర,హైదరాబాద్:** బీఆర్ఎస్ నేతలకు ప్రోటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి సబితారెడ్డికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చామని.. ఆమెకు గౌరవం ఇవ్వకపోతే అడగాలని.. మర్యాద లోపం ఉంటే తప్పు పట్టాలని అన్నారు. మల్కాజ్‌గిరి ఈటల కార్యక్రమానికి వెళ్లకుండా ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమానికి ఈటల తెర లేపారని చెప్పారు. గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రోటోకాల్ లేకుండా కొందరు బతకలేకపోతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక టెన్షన్ లేకుండా పని చేస్తున్నామని సెక్రటేరియట్ ఉద్యోగులు చెబుతున్నారని అన్నారు. పదేళ్లలో రేషన్ కార్డే దిక్కు లేదని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చానని కాలర్ ఎగరేసి చెప్పగలరా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చాకే రేషన్ కార్డులు ఇస్తున్నాం అన్నారు .గత పది సంవత్సరాల కాలం లో ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చారో చెప్పాలని హరీష్‌రావు ను ప్రశ్నించారు . కాంగ్రెస్ చరిత్రతో పోలిస్తే కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ వయస్సు, అనుభవం చాల చిన్నదని చెప్పారు . పదేళ్ల అనుభవంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ అ,ఆ లు కూడా నేర్చుకోలేకపోయారని అన్నారు . ప్రతిపక్షాలను గౌరవించేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనన్నారు . హరీశ్‌రావు, కేటీఆర్‌లకు మతిమరుపు వచ్చినట్టుంది వారు హాస్పిటల్‌కు వెళ్లి చెక్ చేయించుకోవాలి. నా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మాట్లాడితే కేటీఆర్, హరీష్ రావులను పిచ్చోళ్లుగా అర్థం చేసుకుంటారు. రేవంత్ ఎంపీగా ఉన్నప్పుడు ఎప్పుడైనా ప్రోటోకాల్ పాటించారా? రేవంత్ విషయంలో ప్రోటోకాల్ పాటించని బీఆర్ఎస్ నేతలకు ప్రోటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదన్నారు . కోమటిరెడ్డి, సంపత్ ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు కుట్ర చేసి అసెంబ్లీకి రానివ్వకుండా చేసినప్పుడు ప్రోటోకాల్ గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు . వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవాలని ఆ పార్టీ నేతలే మొక్కుకున్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఓడిపోయిన ఎమ్మెల్యేతో హరీష్‌రావు కొబ్బరికాయ కొట్టించాడు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రబుత్వములో సీఎం, మంత్రులను రోజూ చాలామందిని కలుస్తున్నారు'' అని జగ్గారెడ్డి ఈ సందర్భముగా పేర్కొన్నారు.

## సుప్రీం కోర్టు తీర్పు పై కేసీఆర్ భుజాలు తడుముకుంటుండు

**విశ్వంభర, హైదరాబాద్ :** విద్యుత్ కొనుగోళ్ల విషయంలో అక్రమాలు జరిగాయని, కానీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ న్యాయవిచారణ ఎదుర్కోకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణను చేపడుతోందన్నారు. విద్యుత్ ఒప్పందాలపై సుప్రీంకోర్టు విచారణ వ్యవస్థను రద్దు చేయలేదని, విచారణ చేసే జడ్జిని మాత్రమే మార్చమని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. టెక్నికల్ గ్రౌండ్స్ పైనే మార్చాలని న్యాయస్థానం చెప్పినట్లు తెలిపారు. అసలు పక్క రాష్ట్రం నుంచి విద్యుత్‌ను ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో, విద్యుత్ కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందన్నారు. అక్రమంగా దోచుకున్న సొమ్మును కక్కిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే విద్యుత్ ఒప్పందాల పేరిట 133 కోట్లు కమిషన్ కేటీఆర్, హరీష్ రావులు తీసుకున్నారని గోవాలో జరిగిన ఒక సమావేశంలో వ్యాపారవేత్తలు వాపోయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని జగదీశ్వర్ రెడ్డి , హరీష్ రావు సవాలు విసిరి కాలు దువ్వింది నిజం కాదా అని ప్రశ్నించారు .ఇప్పుడు విచారణ చేపడుతుంటే.. కోర్టులను ఆశ్రయించి అడ్డుకట్ట వెయ్యాలన్న విషయంతోనే మీ దుర్బుద్ధి బయటపడిందన్నారు .

## ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఫైట్

(మొదటి పేజీ తరువాయి)
వచ్చిన ఫిర్యాదులపై 3 నెలల్లో చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు తెలిపిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అసెంబ్లీ స్పీకర్ కు చదివి వినిపించానని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ న్యాయ్ పత్ర అంటూ మేనిఫెస్టో విడుదల చేసిందని... పార్టీ ఫిరాయించే ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తామని అందులో స్పష్టంగా పేర్కొందని కేటీఆర్ తెలిపారు. హర్యానాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే బీజేపీలో చేరితే ఆ పార్టీ కొట్లాడుతోందని... కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ రూ. 50 కోట్లకు కొంటోందని సీఎం సిద్ధరామయ్య ఆరోపిస్తున్నారని చెప్పారు. గోవాలో పార్టీ అభ్యర్థులకు బీఫామ్ ఇచ్చే సందర్భంగా వారితో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్టీ మారబోమని ప్రమాణం చేయించారని గుర్తు చేశారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలను వెంటనే రద్దు చేయాలని స్పీకర్ ను కోరామని చెప్పారు.



# జిల్లాకో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం



**విశ్వంభరా, హైదరాబాద్:** ఆయా జిల్లాలో ఉన్న వనరులు, ప్రాంత పరిస్థితుల ఆధారంగా ప్రతి కలెక్టర్ ఒక్కో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమానికి రూపకల్పన చేసి అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆయా కార్యక్రమాలపై కలెక్టర్ల ముద్ర స్పష్టంగా ఉండాలన్నారు. కలెక్టర్లు, ఎస్పీలతో జరిగిన సదస్సులో భోజనవిరామం అనంతరం పలు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి మార్గనిర్దేశనం చేశారు. ఆరు గ్యారెంటీల అమలును కలెక్టర్లు సీరియస్‌గా తీసుకోవాలని, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జాతీయ రహదారులకు భూ సేకరణలో జాప్యం జరుగుతుండడంతో వ్యయం పెరుగుతోందని, సంక్షేమంతో పాటు అభివృద్ధి పైనా దృష్టి సారించాలన్నారు. జిల్లా మంత్రులు, ఇన్ ఛార్జి మంత్రుల కార్యక్రమాలకు సరైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**అటవీ భూముల్లో పండ్ల మొక్కల పెంపకం**
అటవీ భూముల్లో పండ్ల మొక్కలు నాటడం వలన ఓ వైపు గిరిజనులకు ఆదాయం, మరో వైపు పచ్చదనం పెంపొందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గిరిజనులకు ఆదాయం లేకనే పోడు వ్యవసాయంపై ఆధారపడుతున్నారని, వారికి పట్టాలు ఇచ్చిన భూముల్లో మామిడి, సీతాఫలం, జామ వంటి పండ్ల మొక్కలు నాటిస్తే సీజన్ల వారీగా పండ్ల ద్వారా ఆ కుటుంబాలకు ఆదాయం వస్తుందన్నారు. మూడు నుంచి నాలుగేళ్లలో పంట వచ్చే హైబ్రిడ్ మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. ఆదాయం ఉన్నప్పుడు ఆ చెట్లనే వారే రక్షిస్తారని, మరోవైపు పచ్చదనం ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. పలు అటవీ ప్రాంతాల్లో ఎకరాల కొద్దీ ఖాళీ ఉందని, డ్రోన్ల ద్వారా ఏరియల్ సర్వే చేయించాలని ముఖ్యమంత్రి సూచించారు. అనంతరం అక్కడ భూసార పరీక్షలు చేయించి ఆ నేలల్లో పెరిగే పండ్ల మొక్కలు నాటించాలని ఆదేశించారు. తద్వారా కోతుల సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుందని సీఎం అన్నారు. వికారాబాద్ హవా.. టీబీకా దవా అనే (వికారాబాద్ గాలి.. టీబీకి మందు) నానుడి ఉందని, కానీ ఇప్పుడు వికారాబాద్ అటవీ ప్రాంతం చాలా వరకు ఖాళీగా ఉందన్నారు. అక్కడ గతంలోలా ఔషధ మొక్కలు నాటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పులుల సఫారీకి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు మహారాష్ట్రలోని తడోబా అటవీ ప్రాంతానికి వెళుతున్నారని, మన దగ్గర ఆదిలాబాద్ జిల్లాలోనూ అటవీ ప్రాంతం ఉన్నా పులులు సంచారం లేదని, వాటికి అవసరమైన ఆవాసం, నీటి సౌకర్యం కల్పిస్తే అటవీ పర్యాటకం పెంపొందించవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వన మహోత్సంలో మనం నాటే మొక్కలు 50 ఏళ్ల పాటు ఫలసాయం అందించేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కలెక్టర్లు నెలకోసారి అటవీ ప్రాంతాల్లో పర్యటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గతంలోలా ప్రభుత్వ భూమి లభ్యత లేనందున ప్రాజెక్టు కట్టలు, కాలువ కట్టలు, రహదారుల వెంట తాటి, ఈత చెట్లు నాటాలని, మూడునాలుగేళ్లలో గీత వృత్తిదారులకు ఆదాయం వచ్చేలా హైబ్రిడ్ మొక్కలు నాటాలని ఆదేశించారు.

**ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్**
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాలు ఒకే చోట ఉండేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఈ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని, నియోజకవర్గంలో రహదారులకు అనుసంధానంగా ఉండే గ్రామాలు, పట్టణాల్లో వాటికి స్థలాల ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎవరు ముందుగా స్థలాలు ఎంపిక చేస్తే వారికి వెంటనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) అప్ గ్రేడ్ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కలెక్టర్లు తమ పరిధిలోని ఐటీఐలను సందర్శించి వాటిని ఏటీసీలుగా మార్చే ప్రక్రియ ఎలా సాగుతుందో పరిశీలించాలన్నారు. అధునాతన సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నందున ప్రస్తుతం ఉన్న ఐటీఐల్లో స్థలం సరిపోక పోతే ప్రత్యామ్నాయ స్థలం ఎంపిక చేసుకోవాలని సూచించారు. విద్యారంగానికి తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో బడుల్లో మౌలిక వసతులు మెరుగుపర్చామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కలెక్టర్లు పాఠశాలలను తనిఖీ చేయాలని, డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు తరచూ పాఠశాలలను తనిఖీ చేసేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్లు పాఠశాలలు తనిఖీ చేసిన తర్వాత అక్కడ సమస్యలు పరిష్కారం కావాలని, లేకుంటే ఆ తనిఖీలకు ప్రాధాన్యం తగ్గిపోతుందన్నారు. మధ్యాహ్న భోజనం మరింత మెరుగ్గా అందించేందుకు హరేకృష్ణ మూవ్‌మెంట్ వంటి సంస్థల సహకారం తీసుకునే అంశంపై అధ్యయనం చేయాలని విద్యా శాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

**కల్తీపై కఠినంగా వ్యవహరించాలి**
కల్తీ పురుగు మందులు, ఎరువులు, విత్తనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్రానికి అవసరమైన ఎరువులు, యూరియా సిద్ధంగా ఉన్నాయని, సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందుగానే కలెక్టర్లు జాగ్రత్త వహించాలని మంత్రి అన్నారు. కొన్ని సార్లు కృత్రిమ కొరత సృష్టించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ప్రయత్నం చేస్తారని, అటువంటివి జరగకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు.


### రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు రాజీపడొద్దు

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడొద్దని పోలీసు అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులతోనే కానీ నేరస్థులతో కాదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. పబ్బులు విషయంలో టైమింగ్ పెట్టొచ్చని, ఆంక్షల పేరుతో రాత్రి వేళల్లో స్ట్రీట్ ఫుడ్ పెట్టుకునే వారిని ఇబ్బంది పెట్టవద్దని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లకు ముఖ్యమంత్రి సూచించారు. ఐటీ రంగంలో వారు రాత్రి వేళల్లో పని చేయాల్సి ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. పోలీసులు రహదారులపై కనిపించాలని, పీరియాడికల్ క్రైమ్ రివ్యూ చేయాలని, కమిషనర్లు, ఎస్పీలు మొదలు ఎస్ హెచ్ వోల వరకు క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. గతేడాది కన్నా నేరాలు తగ్గాయని పోలీసు అధికారులు వివరించారు. గణాంకాలతో ఆ వివరాలను మీడియాకు తెలియజేయాలని ముఖ్యమంత్రి సూచించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ విషయంలో పోలీసు, ఎక్సైజ్, టీజీ న్యాబ్ అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ముఖ్యమంత్రి అన్నారు. డ్రగ్స్ కేసుల్లో విదేశీయులు పట్టుపడుతున్నారని, వారు ఏ పని మీద రాష్ట్రానికి వస్తున్నారు.. ఏం చేస్తున్నారనే దానిపై దృష్టిసారించాలన్నారు. డ్రగ్స్‌తో పట్టుపడిన వారిని డీఅడిక్షన్ సెంటర్లో ఉంచాలని, ఇందుకోసం చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైలులో కొంత భాగాన్ని వినియోగించుకోవాలన్నారు.

# సుప్రీం కోర్టు తీర్పుపై స్పందించిన జస్టిస్ నరసింహారెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** కమిషన్ అంటేనే ఓపెన్ ఎంక్వయిరీ అని... కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ ప్రెస్ మీట్లు పెడుతుందని జస్టిస్ నరసింహారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను వేసింది. దీనిపై కేసీఆర్ కోర్టుకు వెళ్లడంతో ఈరోజు సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. కొత్త కమిషన్‌ను నియమించాలని ఆదేశించింది. దీంతో నరసింహారెడ్డి తప్పుకున్నారు.ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పుపై జస్టిస్ నరసింహారెడ్డి మాట్లాడుతూ... ఈ వివాదానికి తన ప్రెస్ మీట్ కారణమని చెబుతున్నారని... కానీ ఇప్పటి వరకు ప్రెస్ మీట్ పెట్టకుండా ఉన్న ఒక్క విచారణ కమిటీనైనా చూపించాలన్నారు. షా కమిషన్ వంటివి ఎన్నో ప్రెస్ మీట్లు పెట్టాయన్నారు. సుప్రీంకోర్టు ప్రాథమిక వాదోపవాదనలు మాత్రమే విన్నదని పేర్కొన్నారు. ఇంకాస్త లోతుగా విచారించి ఉంటే తాను ప్రెస్ మీట్‌లో అభిప్రాయం చెప్పానో లేదో తెలిసేదన్నారు. తన ప్రెస్‌మీట్‌లో ఎలాంటి అంశాలను బయట పెట్టలేదన్నారు. లోతైన విచారణ వద్దని కోర్టు భావించినట్లుగా ఉందన్నారు. తాను మాత్రం అభిప్రాయం చెప్పలేదన్నారు.అయినప్పటికీ సుప్రీంకోర్టు తీర్పుపై తాను ఎలాంటి కామెంట్ చేయదల్చుకోలేదన్నారు. అయితే కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ ప్రెస్ మీట్లు పెడుతుందని తాను ఇప్పటికీ చెబుతున్నానన్నారు. కమిషన్ అంటేనే ఓపెన్ ఎంక్వయిరీ అని అర్థమని పేర్కొన్నారు. అసలు కమిషన్ ప్రెస్ మీట్లు పెడితే తప్పేమిటన్నారు. ప్రెస్ మీట్లు పెట్టి తాను ఎలాంటి అంశాలు బయటపెట్టలేదన్నారు.

**జస్టిస్ నరసింహారెడ్డి రాజీనామా**
విద్యుత్తు కమిషన్‌పై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ నరసింహారెడ్డి మంగళవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని ఊహాగానాలకు చెక్ పెట్టేందుకు తాను మీడియా సమావేశం నిర్వహించానని తెలిపారు. ఆ సందర్భంగా తాను ఎక్కడా సొంత అభిప్రాయం చెప్పలేదని వివరించారు. తాను సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయినట్లు ప్రచారం జరిగిందని, కానీ, తాను ఆయనతో ఫోన్‌లోనూ మాట్లాడలేదని స్పష్టం చేశారు. 'విద్యుత్తు కమిషన్ విచారణలో ఎవ్వరికీ నోటీసులు ఇవ్వలేదు. 28 మందికి లేఖలు రాశా. కేసీఆర్ తప్ప మిగతా వారంతా వారి అభిప్రాయాలు చెప్పారు. ఎంతో మంది కమిషన్ చైర్మన్లు మీడియా సమావేశాలు పెట్టినా రాని అభ్యంతరం నాపైనే ఎందుకు వచ్చిందో తెలియలేదు' అని తెలిపారు. విద్యుత్తు కమిషన్ చైర్మన్‌గా కొనసాగే అర్హత లేదంటూ కేసీఆర్ తనకు లేఖ రాశారని, అందులో సమాజం అంగీకరించని భాష వాడారని జస్టిస్ నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'అందరి అభిప్రాయాలు తీసుకొన్నాకే నివేదిక సిద్ధం చేశా. నేను ఇచ్చే నివేదిక నా వ్యక్తిగతం. దానిపై ఎవరికీ హక్కు లేదు. కమిషన్ ఇచ్చే నివేదికను ప్రభుత్వం అంగీకరించవచ్చు.. లేదా అంగీకరించకపోవచ్చు. దాన్ని ఎవరైనా సవాల్ చేయొచ్చు' అని పేర్కొన్నారు. కాగా, విచారణ కమిషన్ చైర్మన్‌గా వేరొకరిని నియమించాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. దీంతో చైర్మన్ పదవికి జస్టిస్ నరసింహారెడ్డి రాజీనామా చేశారు. ఆ రాజీనామా లేఖను తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది సుప్రీం బెంచ్‌కు అందజేశారు.




## ప్రేమోన్మాది దాడిలో గాయపడిన అన్నాచెల్లెలికి కేటీఆర్ అండ

**విశ్వంభర, హైదరాబాద్ :** నర్సంపేట నియోజకవర్గంలోని 16 చింతల తండా గ్రామంలో వారం రోజుల క్రితం ప్రేమోన్మాది చేతిలో దారుణ హత్యకు గురైన గిరిజన కుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందుకు వచ్చారు. ప్రేమోన్మాది దాడిలో తల్లిదండ్రులిద్దరూ చనిపోవటంతో ఆ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. దాడి ఘటనలో ఇద్దరు పిల్లలు కూడా తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం కోలుకున్నారు. చనిపోయిన దంపతుల పిల్లలిద్దరిని మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి మంగళవారం కేటీఆర్ వద్దకు తీసుకొచ్చారు. పిల్లలద్దరినీ చూసిన కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.వారి ఆరోగ్యం గురించి వాకబు చేసి ధైర్యంగా ఉండాలని మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.పిల్లలిద్దరీ చదువు బాధ్యత తానే స్వయంగా తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. హత్యకు గురైన పిల్లల తల్లి సుగుణ బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త. గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్ కూడా. పార్టీ తరపున కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.5 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. అత్యంత విషాదకరమైన ఈ సంఘటనలో తల్లిదండ్రులను కోల్పోవటమే కాదు...దాడికి గురైన పిల్లలు దీర్ఘాకాలం చికిత్స తీసుకోవాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో కుటుంబానికి భరోసా ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం వారికి రూ.50 లక్షలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ ఘటనలో నిందితుడికి కఠిన శిక్ష పడేలా తగిన చర్యలు తీసుకునేలా డీజీపికి ఆదేశాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

## నేడు స్కూలు, కాలేజీలకు సెలవు

**విశ్వంభర, హైదరాబాద్ :** తొలి ఏకాదశి సందర్భంగా నేడు ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణలో పబ్లిక్ హాలిడే ఉండనుంది. స్కూళ్లు, కాలేజీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు మూసి ఉండనున్నాయి. జులై 17న హిందువుల తొలి ఏకాదశి, ముస్లింల మొహర్రం సందర్భంగా సెలవు ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. ఆషాఢమాసం శుక్లపక్షం ఏకాదశి.. తొలి ఏకాదశి పండుగ.. హిందువులకు ఎంతో పవిత్రమైన రోజు.. అంతేకాదు, హిందువులకు తొలి పండుగను ఈ రోజునే జరుపుకుంటారు. ఈరోజు భక్తులు విష్ణుమూర్తిని పూజించి దేవాలయాలను సందర్శిస్తారు. ఉపవాస వ్రతం పాటించి ఎంతో భక్తి శ్రద్ధలతో భగవాన్నామస్మరణ చేస్తారు. అలాగే, మోహరం ఇస్లామిక్ క్యాలెండర్లో ఇది మొదటి నెల. ఈ మాసంలో ముస్లింలు సంతాపం తెలుపుతారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హుసేన్ ఇబ్న్ అలీ బంధువులతో కలిసి అమరుడైన రోజని ముస్లిం పెద్దలు చెబుతారు.

# తిహార్ జైలులో కవితకు అస్వస్థత..




**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న కవిత స్వల్ప అస్వస్థతకు గురైయ్యారు. దీంతో ఆమెను వెంటనే ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. తీవ్రమైన జ్వరంతో పాటూ, గైనిక్‌కు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నట్లు జైలు అధికారులు తెలిపారు. చికిత్స నిమిత్తం మంగళవారం సాయంత్రం 4 గంటలకు హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించినట్లు వెల్లడించారు. ఆమెను పరిశీలించిన వైద్యులు చికిత్సలో భాగంగా రక్తనమూనాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. వాటి నుంచి వచ్చిన ఫలితాల ఆధారంగా ప్రత్యేక వైద్య బృందం చికిత్స అందజేశారు. వైద్యపరీక్షలనంతరం ఆమెను తిరిగి తిహార్ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఈడీతో పాటూ సీబీఐ కేసుల్లో కూడా కవిత విచారణను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే అనేక బెయిల్ పిటిషన్లు వేసినప్పటికీ సీబీఐ, ఈడీ తరఫు వాదనలతో ఏకీభవించిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు జుడీషియల్ రిమాండుకు ఆదేశించింది. మార్చి 15న హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు తిహార్ జైలుకు తరలించారు. ఆ తరువాత ఏప్రిల్ 11న సీబీఐ కూడా ఈ కేసును దర్యాప్తు చేపట్టేందుకు ముందుకు రావడంతో బెయిల్ మంజూరులో తీవ్ర జాప్యం ఏర్పడింది. ఇప్పటికే 120 రోజులకు పైగా ఆమె జుడీషియల్ రిమాండులో కవిత ఉన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తనకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని కోరారామె. విచారణ జరిపిన కోర్టు.. కేసులో కవిత పాత్రపై సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై పరిశీలించింది. సీబీఐ కేసులో డిఫాల్ట్ బెయిల్ ఇచ్చే పిటిషన్ విచారణను జులై 22కు వాయిదా వేసింది. జూలై 18 వరకూ జుడీషియల్ కస్టడీలో ఉండాలని ఆదేశించింది. దీనికి కారణం ఆమెపై దాఖలు చేసిన చార్జ్ షీట్లో తప్పులు ఉన్నాయని వాదించారు కవిత తరఫు న్యాయవాది. దీనికి కౌంటర్ గా ఎలాంటి తప్పులు లేవని తెలిపారు సీబీఐ తరఫు న్యాయవాది. మద్యం పాలసీ కుంభకోణంలో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు మాత్రమే కవితకు బెయిల్ ఇవ్వొద్దని వాదనలు వినిపించారు సీబీఐ తరఫు న్యాయవాదులు. అయితే కవిత డిఫాల్ట్ బెయిల్, సీబీఐ చార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకునే అంశంపైనా జూలై 22న విచారణ జరువుతామని తెలిపింది రౌస్ అవెన్యూ కోర్టు. దీనిపై స్పష్టమైన తీర్పు వస్తుందా లేదా అని చాలా మంది ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# జ్యూడీషియల్ కమిషన్‌ను రద్దు చేయలేం



**(మొదటి పేజీ తరువాయి)**
అభిప్రాయానికి వచ్చేశారన్నారు సీజేఐ. కమిషన్ జడ్జిని మార్చే అవకాశం ఇస్తున్నామని సీజేఐ తెలిపారు. నోటీసు ఇవ్వడం కోసం ప్రెస్ మీట్ పెట్టినప్పుడు, జడ్జి స్వయంగా మీడియాను అడ్రస్ చేయాల్సిన అవసరం లేదన్నారు చీఫ్ జస్టిస్. కమిషన్ జడ్జి కేసులోని మెరిట్స్ గురించి మాట్లాడకపోతే, తాము కూడా వదిలేసేవాళ్లమన్నారు. ఎంక్వైరీ రిపోర్ట్ ఓ వ్యక్తి ప్రతిష్టను ప్రభావితం చేస్తుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

**పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యే..**
అయితే, సీజేఐ వ్యాఖ్యలతో విభేదించారు ప్రభుత్వ తరపు న్యాయవాది సింఘ్వీ. ఇప్పటికే కొన్ని నెలల పాటు విచారణ జరిగిందని, కొత్త జడ్జిని ఏర్పాటు చేస్తే మళ్లీ మొదటికి వస్తుందన్నారు. మరోవైపు, కేసీఆర్ తరపున లాయర్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని ముకుల్ రోహత్గి ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం మారిన ప్రతిసారీ మాజీ సీఎంలపై కేసులు పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో విద్యుత్ సంక్షోభం ఏర్పడిందని, అందుకే ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం జరిగిందన్నారు. దానికి రెండు రాష్ట్రాలూ ఆమోదించాయని కోర్టుకు తెలిపారు రోహత్గి. అలాగే, భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థ భేల్‌కే అప్పగించారని, అన్ని కాంట్రాక్టులూ ప్రభుత్వాలతో, ప్రభుత్వరంగ సంస్థలోనే ఉన్నప్పుడు తప్పేముందని కోర్టుకు విన్నవించారు న్యాయవాది రోహత్గి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ఉండగా.. సబ్ క్రిటికల్ టెక్నాలజీతో పవర్ ప్లాంట్ కట్టారని ప్రశ్నిస్తున్నారన్నారు. ఇలా ఎందుకు కట్టారన్నది విచారణ జరపాల్సిన అంశమా? అంటూ ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు లాయర్ రోహత్గి. రెండు ఆప్షన్స్ ఉన్నప్పుడు, ఒకదాన్ని ఎంచుకోవడం తప్పెలా అవుతుందన్నారు.

### కేసీఆర్‌కు వ్యతిరేకంగా వేసిన కమిషన్ కాదు

రాష్ట్రప్రభుత్వం తరపున సింఘ్వీ వాదనలు వినిపించారు. ఇదేమీ కేసీఆర్ కు వ్యతిరేకంగా వేసిన కమిషన్ కాదని సింఘ్వీ పేర్కొన్నారు. ఇందులో చాలామంది ఇతర వ్యక్తులు కూడా ఉన్నారన్నారు. సబ్ క్రిటికల్ టెక్నాలజీతో రెండేళ్లలో పవర్ ప్లాంట్ నిర్మాణం జరపవచ్చని, తద్వారా రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభాన్ని త్వరగా పరిష్కరించవచ్చని బదులిచ్చారు సింఘ్వీ. మరి, ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏడేళ్లు ఎందుకు పట్టింది? అని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాజెక్టుతో ప్రభుత్వానికి ఎంత నష్టం జరిగిందనేది తెలుసుకోవాల్సి ఉందన్నారు సింఘ్వీ. సబ్ క్రిటికల్ టెక్నాలజీతో కాలుష్యం ఎక్కువ ఉండడమే కాదు, ఆర్థికంగా కూడా నష్టమేనని నిపుణుల నివేదికలు ఉన్నాయని సింఘ్వీ సుప్రీంకోర్టుకు నివేదించారు. ఇదే అంశంపై మాజీ సీఎంకు జూన్15 దాకా గడువునిస్తూ, ఏప్రిల్‌లో కమిషన్ నోటీసులు ఇచ్చిందని సింఘ్వీ గుర్తుచేశారు.

# రుణమాఫీ కావాలంటే రైతులు అప్పులు చేయాలా..?

**(మొదటి పేజీ తరువాయి)**
వర్తిస్తుందనడం దారుణం. అంటే దీర్ఘకాలిక పంటలకు లేదన్నట్లు.. బత్తాయి తోట, మామిడి తోట, ఫాం ఆయిల్ ఇలాంటి పంటలకు రుణమాఫీ లేదు. అంటే దాదాపు పది లక్షల ఎకరాలకు రుణమాఫీ లేనట్టే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రీషెడ్యూల్ చేసుకున్న వారికి రుణాలు వర్తించవు అన్నారు. తీవ్రంగా రైతులు నష్టపోయినప్పుడు, కరువు పరిస్థితులు ఉన్నపుడు, వరదలు వచ్చి పంట పొలాలు కొట్టుకుపోయినప్పుడు రీషెడ్యూల్ చేస్తారు. నిజానికి వారే ఇంకా ఎక్కువ ఇబ్బందుల్లో ఉన్నవారు చేస్తారు. వారికి రుణమాఫీ లేదని చెప్పడం దుర్మార్గం. సకాలంలో తీసుకున్న అప్పులు కట్టిన వారికి మొండి చేయి చూపడం సరికాదు. దీన్ని కూడా ఆలోచించాలి. రైతును సానుభూతితో చూడాలి. రుణమాఫీ వారికి కూడా చేయాలని కోరుతున్నాం అని హరీశ్‌రావు చెప్పారు. రుణమాఫీ అమలుకు స్టార్టింగ్ డేట్ ఉండదు.. ఎండింగ్ డేట్ ఉంటుంది. మేము అలాగే చేశాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 12, 2018 కంటే ముందు తీసుకున్న రుణాలకు వర్తించదు అంటున్నారు. ఇలా కొందరు రైతులకు కోత పెట్టినట్లే కదా. ఇది తీవ్రమైన అన్యాయం. అసలు వడ్డీ కలిపి రెండు లక్షలు మాఫీ చేస్తం అన్నారు. కానీ మీరు అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9 నాడే మాఫీ చేస్తం అన్నారు. కానీ, 8 నెలల కాలానికి వడ్డీ ఎవరు భరించాలి. మీరు మేనిఫెస్టోలో చెప్పినట్లుగా రుణమాఫీ చేయాలి. అమలు చేసే దాకా అయ్యే వడ్డీని కూడా ప్రభుత్వమే భరించాలి. గతంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డు ప్రామాణికం కాదు అన్నారు. నాలుగు రోజుల తర్వాత రేషన్ కార్డే ప్రామాణికం అంటున్నారు. ఎన్నికల ముందు వడ్లకు బోనస్ ఇస్తాం అన్నారు. ఎన్నికల తర్వాత సన్నాలకు మాత్రమే బోనస్ అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.. పది శాతం సన్నాలకు ఇచ్చి, 90శాతం రైతులకు పంగనామాలు పెడుతున్నరు అని హరీశ్‌రావు మండిపడ్డారు.




# అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్

**(మొదటి పేజీ తరువాయి)**
సర్కార్ మరో పథకానికి శ్రీకారం చుడుతున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని రహమత్ నగర్ లో జరిగిన "అమ్మ మాట అంగన్వాడి బాట" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... పదవీ విరమణ పొందే అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లకు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. రిటైర్ అయ్యే అంగన్ వాడీ టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్మెంట్ ప్యాకేజీని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రెండు మూడు రోజుల్లో దీనికి సంబంధించి అధికారిక జీవో విడుదల చేస్తామని సీతక్క హామీ ఇచ్చారు. నామమాత్రపు వేతనంతో సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బంది కష్టాలు ప్రభుత్వానికి తెలుసని మంత్రి అన్నారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు. ప్రభుత్వ ప్రకటనపై అంగన్వాడీలు హర్షం వ్యక్తం చేశారు.




**అంగన్వాడీల ధర్నాలు...**
ఇటీవల ఎన్నికల సమయంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ సహా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఉద్యోగ విరమణ, పెన్షన్ సదుపాయం తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఉద్యోగులను వంచించే విధంగా ఉందని అంగన్వాడీ టీచర్స్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రభుత్వం జీవో నంబర్ 10ని వెనక్కు తీసుకుని కొత్త జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. వీరి ధర్నాల నేపథ్యంలోనే ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్ ని ప్రకటించినట్లు స్పష్టం అవుతోంది. కాగా, తెలంగాణలోని అంగన్వాడీ కేంద్రాలను అప్గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల భవనాల్లో కొనసాగుతున్న సుమారు 15 వేల అంగన్వాడీ కేంద్రాలను తొలిదశలో ఉన్నతీకరిస్తున్నది. వాటిని ప్రీప్రైమరీ పాఠశాలలుగా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే వాటిని అందుబాటులోకి తీసుకొచ్చింది.

# చంచల్ గూడ జైలుకి రకుల్ ప్రీత్ సోదరుడు

**విశ్వంభర, హైదరాబాద్ :** డ్రగ్స్ కేసులో నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ కు న్యాయస్థానం జుడీషియల్ రిమాండ్ విధించింది. అమన్ కి పాజిటివ్ రావడంతో అతనితోపాటు ఐదుగురు నిందితులకు ఉప్పర్ పల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు వీరిని చంచల్ గూడ జైలుకి తరలించారు. కాగా, టాలీవుడ్ ని డ్రగ్స్ వ్యవహారం వెంటాడుతూనే ఉంది. ఎక్కడ భారీగా డ్రగ్స్ పట్టుబడినా టాలీవుడ్ కి సంబంధించిన వ్యక్తుల పేర్లు వినపడటం పరిపాటి అయిపోయింది. ఈ క్రమంలో సోమవారం హైదర్షాకోట్ లో పోలీసులు నిర్వహించిన దాడిలో టాలీవుడ్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ పట్టుబడ్డారు. దీంతో ఈ విషయం నేషనల్ వైడ్ హాట్ టాపిక్ అయింది. సంచలనం రేపిన ఈ కేసు వివరాలను రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ మీడియాకి వెల్లడించారు. కేసు వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ హైదర్షాకోట్ లోని విశాఖనగర్ వ్యూ అపార్ట్మెంట్ లో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా ఉన్నట్లు పోలీసులకులు సమాచారం అందింది. దీంతో తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) అధికారులు సైబరాబాద్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రకుల్ ప్రీత్ సోదరుడు అమన్ ప్రీత్ సహా 13 మంది వినియోగదారులు పట్టుబడ్డారు. 13 మంది వినియోగదారులను అమన్, కిషన్ రాఠి, అనికేత్, యశ్వంత్, రోహిత్, శ్రీ చరణ్, ప్రసాద్, హేమంత్, నిఖిల్, మధు, రఘు, కృష్ణం రాజు, వెంకట్‌లుగా గుర్తించారు. ఇద్దరు నైజీరియన్లు సహా ఐదుగురు డ్రగ్స్ స్మగర్లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం పోలీసులు వారికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో పదిమందికి పాజిటివ్ రాగా... వారిలో అమన్ కొకైన్ తీసుకున్నట్లు తేలిందని డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. నైజీరియాకు చెందిన ఒనుహా బ్లెస్సింగ్ అలియాస్ జోయానా గోమ్స్ అలియాస్ జో అనే మహిళ డ్రగ్స్ సరఫరా డాన్ గా పోలీసులు గుర్తించారు. ఆమెతోపాటు నైజీరియాకు చెందిన అజీజ్ నొహీం అడెషోలా ఈ కార్యకలాపాల్లో ముఖ్య సభ్యుడిగా ఉన్నట్లు తేలింది. హైదరాబాద్ కు చెందిన అల్లం సత్యవెంకట గౌతమ్, సానబోయిన వరుణ్ కుమార్, మహమ్మద్ మహబూబ్ షరీఫ్ వీరి ముఠాలో పెడ్లర్లుగా పని చేస్తున్నట్లు పోలీసులు తేల్చారు. కాగా, అపార్ట్మెంట్ పై పోలీసులు దాడి చేసి నిందితులను అరెస్ట్ చేయడంతోపాటు... వీరి నుంచి రూ. 35లక్షల విలువ చేసే 199 గ్రాముల కొకైన్ ని సీజ్ చేశారు. ఇక వీరి గ్యాంగ్ కి సంబంధించిన నైజీరియన్ స్మగ్లర్లు డ్రైవిన్ ఎబుకా అలియాస్ ఇమ్మాన్యుయేల్, ఎజియోనిలి ఫ్రాంక్లిన్ అలియాస్ కలేషీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**ఏ6 గా అమన్ ప్రీత్...**
డ్రగ్స్ కేసులో పట్టుబడిన అమన్ ప్రీత్ సింగ్ ని ఏ6 గా పోలీసులు చేర్చారు. ఏ1 గా ఒనుహా బ్లెస్సింగ్, ఏ2 గా అజీజ్, ఏ3 గా అల్లం సత్యానారాయణ, ఏ4 గా సానబోయిన వరుణ్, ఏ5 గా మహబూబ్ షరీఫ్, ఏ6 గా అమన్ ప్రీత్ సింగ్ ని డ్రగ్స్ కేసులో నిందితులుగా చేర్చారు. అమన్ ప్రస్తుతానికి కస్టమరేనని తాము గుర్తించినట్లు టీజీ న్యాబ్ పోలీసులు తెలిపారు. అతను నిజంగానే కస్టమరా? లేక డ్రగ్స్ సప్లయరా? అనేది దర్యాప్తులో తేలుతుందని అన్నారు.

## బంధువుల మాటలకు నవ దంపతులు బలి.. రైలు కిందపడి సూసైడ్!

**నిజామాబాద్, జులై 16:** నిజామాబాద్ జిల్లాలో యువజంట బలన్మరణానికి పాల్పడింది. దంపతులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. తమపై బంధువులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదని తెలియజేస్తూ వీడియో చిత్రీకరించి, ఆ సెల్ఫీ వీడియోను పోలీసులకు పంపించారు. అనంతరం ప్రాణాలను తీసుకున్నారు. వారిని కాపాడేందుకు పోలీసులు ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఈ దారుణ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం ఫకీరాబాద్‌మిట్టాపూర్ మధ్యలో సోమవారం (జులై 15) రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హెగ్డోలికి చెందిన అనిల్ (28), అదే మండలానికి చెందిన శైలజ (24)కు ఏడాది కిందట వివాహమైంది. ఎంతో సాఫీగా సాగిపోతున్న వీరి కాపురంలో బంధువులు చిచ్చుపెట్టారు. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూకు వెళ్తున్నట్లు దంపతులిద్దరూ కుటుంబీకులకు చెప్పి, సోమవారం ఇంటి నుంచి వెళ్లారు. అనంతరం తాను గతంలో ఓ తప్పు చేశానని, దాన్ని భర్త క్షమించినా బంధువులు సూటిపోటి మాటలతో చిత్రహింసలకు గురిచేస్తున్నారని దంపతులు ఇద్దరూ సెల్ఫీ వీడియోను చిత్రీకరించారు. వారు తమపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తట్టుకోలేక ఇద్దరం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నట్లు వీడియో చిత్రీకరించారు. అనంతరం ఈ వీడియోలను కోటగిరి ఎస్సై సందీప్‌కు పంపారు. ఈ వీడియో చూసిన ఆయన వెంటనే నవీపేట ఎస్సై యాదగిరిగౌడ్‌కు వీడియోతోపాటు వారి సెల్‌ఫోన్ నంబరు పంపి, అప్రమత్తం చేశారు. దంపతులు ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరి వద్దకు వస్తున్నట్లు వీడియోలో చెప్పారు.



# లక్ష్యానికి దూరంగా అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం

ఒక్క అమాయకుడికి కూడా అన్యాయము జరగకూడదన్న సూత్రము న్యాయ వయ్యస్థకు పునాది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం, అనేది "అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం" అని కూడా పిలువ బడుతుంది. దీనిని ప్రపంచ వ్యాప్తంగా జూలై 17 న జరుపుకుంటారు. యుద్ధ నేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నేతలపై విచారణ జరిపేందుకు ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొట్టమొదటిసారి 1919లో జరిగిన పారిస్ శాంతి సదస్సులో కమిషన్ ఆఫ్ రెస్పాన్సిబిలిటీస్ తెరపైకి తీసుకొచ్చింది. లీగ్ ఆఫ్ నేషన్స్ ఆధ్వర్యంలో నవంబరు 1-16, 1937 మధ్య జెనీవాలో జరిగిన సదస్సులో ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా చోటుచేసుకున్న దురాగతాలపై విచారణ జరిపేందుకు ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని 1948లో మొదటిసారి ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో గుర్తించారు.

## నేడు ప్రపంచ న్యాయ దినోత్సవం



రెండో ప్రపంచ యుద్ధం తరువాత నాజీ యుద్ధ నేరాలపై దర్యాప్తు జరిపిన ఒక పరిశోధకుడు, న్యూరెంబర్గ్‌లో అమెరికా అధికారిక యంత్రాంగం జరిపిన పన్నెండు సైనిక విచారణల్లో ఒకటైన ఐన్‌శాట్జ్‌గ్రూపెన్ విచారణలో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్మీ ప్రధాన న్యాయవాదిగా వ్యవహరించిన బెంజమిన్ బి. ఫెరెంజ్... ఒక అంతర్జాతీయ చట్ట పాలన, ఒక అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం ఏర్పాటుకు ప్రధాన మద్దతుదారుగా మారారు.

1975లో ప్రచురించిన 'డిఫైనింగ్ ఇంటర్నేషనల్ అగ్రెషన్ ది సెర్చ్ ఫర్ వరల్డ్ పీస్' అనే తన మొదటి పుస్తకంలో, ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు కోసం వాదించారు. అలా

ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని సృష్టించాలని ప్రతిపాదన రావడంతో, 1989లో ఈ ఆలోచనకు రూప కల్పన చేసేందుకు, ముసాయిదాను తయారు చేసేందుకు నడుం బిగించ బడింది. యుగోస్లావియా, రువాండాల్లో యుద్ధ నేరాలపై విచారణ జరిపేందుకు న్యాయస్థానాలు తొలుత ఏర్పడ్డాయి. దీంతో ఒక శాశ్వత అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం ఏర్పాటు అవసరం మరింత ప్రాధాన్యత పొందింది. ఇందుకు సంబంధించి ఒక ఒప్పందాన్ని ఖరారు చేసే లక్ష్యంతో ఐక్య రాజ్య సమితి సాధారణ సభ జూన్ 1998లో రోమ్ నగరంలో ఒక సదస్సును ఏర్పాటు చేసింది. 21 దేశాలు ఈ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఒప్పందానికి చైనా, ఇరాక్, ఇజ్రాయెల్, లిబియా, ఖతర్, యునైటెడ్ స్టేట్స్, యెమెన్ ఏడు దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. జూలై 17, 1998న అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం రోమ్ శాసనం, 120 7 ఓట్ల తేడాతో ఆమోదించబడింది. ఇదే రోజున అంతర్జాతీయ న్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

ఏప్రిల్ 11, 2002న రోమ్ శాసనం సభ్య దేశాల ఆమోదంతో ఒక బంధన ఒప్పందంగా మారింది. శాసనం న్యాయబద్ధంగా జులై 1, 2002 నుంచి అమల్లోకి వచ్చింది. ఐసీసీ (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) కు ఆ రోజు తరువాత జరిగిన నేరాలపై మాత్రమే విచారణ జరిపే అధికారాన్ని కల్పించారు. 18 మంది న్యాయమూర్తులతో కూడిన మొదటి ధర్మాసనాన్ని సభ్యదేశాల సభలో ఫిబ్రవరి 2003లో ఎన్నుకోవడం జరిగింది. ఈ న్యాయమూర్తులు మార్చి 1, 2003న న్యాయస్థాన ప్రారంభ సెషన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు.

అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రెండూ వేరు వేరు సంస్థలు. వీటి రెండిటికీ పరిధి ఉంది. అంతర్జాతీయ న్యాయస్థానం లేదా ప్రపంచ న్యాయస్థానం ఐక్యరాజ్యసమితి ప్రాథమిక న్యాయ అంగంగా నెదర్లాండ్ లోని హేగ్ నగరంలోగల, శాంతి సౌధం లో యున్నది. దీని ప్రధాన కార్యక్రమం, సభ్యదేశాల ద్వారా సమర్పించబడిన "న్యాయపర వాదనలు" ఆలకించడం, తీర్పు చెప్పడం. అయితే దీని యొక్క విచారణలు ఎక్కడైనా జరగవచ్చు. ఆగస్టు 2010 నాటికి, 113 దేశాలు న్యాయస్థానంలో సభ్య దేశాలయ్యాయి, దాదాపుగా అన్ని ఐరోపా మరియు దక్షిణ అమెరికా దేశాలు, ఆఫ్రికాలోని సగం దేశాలు ఇప్పుడు దీనిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. మానవాళి చరిత్రలో మొట్టమొదటిసారి, ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఒక వ్యక్తికి నష్టపరిహారాన్ని మరో వ్యక్తి చెల్లించాలని ఆదేశించే అధికారాన్ని కల్పించారు. ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఇటువంటి అధికారం కల్పించడం కూడా ఇదే మొదటిసారి.

కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాల గురించి న్యాయస్థానానికి ఫిర్యాదులు అందాయి.

న్యాయస్థానం ఐదు కేసులపై విచారణలు ప్రారంభించింది: ఉత్తర ఉగాండా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, డార్ఫూర్ (సూడాన్) మరియు రిపబ్లిక్ ఆఫ్ కెన్యా కేసులపై ఈ న్యాయస్థానం విచారణలు చేపట్టింది. న్యాయస్థానం పదహారు మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. వీరిలో ఏడుగురు పరారీలో ఉండగా, ఇద్దరు మరణించారు (లేదా మరణించినట్లు విశ్వసిస్తున్నారు), నలుగురు నిర్బంధంలో ఉన్నారు. ముగ్గురు స్వచ్ఛందంగా న్యాయస్థానం ఎదుట లొంగిపోయారు. 2007 అక్టోబరు 4నాటికి కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాలకు సంబంధించి విచారణకర్తకు 2889 సమాచారాలు వచ్చాయి. అయితే ప్రాథమిక సమీక్ష తరువాత, ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులను న్యాయస్థానం యొక్క అధికార పరిధికి వెలుపల ఉన్న పరిస్థితులుగా గుర్తించి తోసిపుచ్చడం జరిగింది.

ఐసిసికి 123 సభ్య దేశాల మద్దతు ఉందని చెపుతున్నా, ఐసిసి ఒక న్యాయ వ్యవస్థగా రోమ్ స్టాచ్యూట్‌కు కట్టుబడి, స్వతంత్రంగా, నిష్పాక్షికంగా పని చేస్తుందని ప్రకటిస్తున్నా, లక్ష్య సాధనకు బహుదూరంలో ఉంది. అమెరికా ఆంక్షల నీడలు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) మీద కూడా పడడం, సభ్య దేశాల సహకార లోపం తదితర కారణాలతో ఆశించిన ఫలితం రావడం లేదు.


- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# అక్కినేని, దుక్కిపాటిలది అద్వితీయ అనుబంధం

దుక్కిపాటి మధుసూదనరావు ( జూలై 17, 1917 మార్చి 26, 2006) కు తెలుగు సినిమాతో 1940 నుంచే అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావు సినీ జీవితాన్ని ప్రభావితం చేసిన అతి ముఖ్యుల్లో దుక్కిపాటి ఒక్కరు. అక్కినేనికి చిత్రసీమలో మార్గదర్శిగా నిలచి ఆయన నటునిగా సినీ చరిత్రలో నిలచి పోయేలా చేయడంలో ప్రధాన భూమిక పోషించారు దుక్కిపాటి. అన్నపూర్ణ పిక్చర్స్ పతాకంపై సినిమాలు సిర్మించిన ప్రముఖ తెలుగు నిర్మాత. దుక్కిపాటి 1951సెప్టెంబరు10వ తేదీన అక్కినేని నాగేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, కొరటాల ప్రకాశరావు టి.వి.ఎ.సూర్యారావు లతో కలసి అన్నపూర్ణ పిక్చర్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థను స్థాపించి, మొదటి ప్రయత్నంగా "దొంగరాముడు" సినిమాను తీశారు. దుక్కిపాటి తనని అమ్మకన్నా మిన్నగా పెంచి పోషించిన సవతితల్లి అన్నపూర్ణ పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించారు. దానికి అక్కినేని నాగేశ్వరరావుని ఛైర్మన్ ను చేశారు.

## నేడు దుక్కిపాటి మధుసూదనరావు జయంతి





కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా పెయ్యేరు గ్రామంలో దుక్కిపాటి మధుసూదన రావు జూలై 17, 1917 న సంపన్న వ్యవసాయ కుటుంబంలో గంగాజలం, సీతారామ స్వామి దంపతులకు జన్మించారు. బందరు నోబుల్ కళాశాలలో బి.ఏ చదివారు. ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించారు.

చదువు పూర్తి చేసుకున్న దుక్కిపాటి, తాను కార్యదర్శిగా ఎక్సెల్సియల్ క్లబ్బు అనే నాటక సంస్థను ప్రారంభించారు. కోడూరి అచ్చయ్య, ఎం.ఆర్.అప్పారావు వంటి మిత్రులతో కలసి ఆ క్లబ్బు పక్షాన నాటకాలు విరివిగా ప్రదర్శించారు.

ఎక్సెల్సియల్ క్లబ్బులో దుక్కిపాటితో పాటు పెండ్యాల, బుద్ధిరాజు శ్రీరామమూర్తి వంటివారు ఉండేవారు. వారి సహకారంతో ఆయన ఆశాజ్యోతి, సత్యాన్వేషణ, తెలుగుతల్లి వంటి సాంఘిక నాటకాలను రాయించి చేపట్టారు. అవి ఘన విజయాలను నమోదు చేసుకున్నాయి.

ఆ సమయంలో దుక్కిపాటికి అక్కినేనితో పరిచయం విచిత్రంగా కలిగింది. అప్పటికే అక్కినేని ధర్మపత్ని చిత్రంలో నటించి వెనక్కి వచ్చేశారు. బుద్ధిరాజు శ్రీరామమూర్తి సలహాతో 'విప్రనారాయణ' నాటకంలో దేవదేవి పాత్ర పోషిస్తున్నారు. ఆ నాటక ప్రదర్శన చూసిన దుక్కిపాటి, తమకు కథానాయిక/స్త్రీ పాత్ర లేని లోటు తీరిందని అక్కినేనిని హీరోయిన్ని చేశారు. అలా వారంతా నాటకాల్లో బిజీగా ఉన్నప్పుడే ఘంటసాల బలరామయ్య ఓ రైల్వే స్టేషన్లో అక్కినేనిని చూసి తన సినిమాకు ఆయనే తగిన వ్యక్తి అని నిర్ధారించుకొని చిరునామా తీసుకొన్నారు. తర్వాత గుడివాడకు వచ్చి అక్కినేనికి కబురు చేశారు. దుక్కిపాటి, రామబ్రహ్మం (అక్కినేని సోదరుడు) ఇద్దరూ అక్కినేనిని ఘంటసాల బలరామయ్య వద్దకు తీసుకెళ్లారు. ఆయన వారిని మద్రాసు కొచ్చి 'ప్రతిభ' ఆఫీసులో సంప్రదించ మన్నారు. దుక్కిపాటి, మరో మిత్రుడు సూర్యప్రకాశరావుతో కలసి అక్కినేనిని తీసుకొని మద్రాసులో 'ప్రతిభ' ఆఫీసుకు వెళ్లగా, పేకేటి అక్కినేని స్వాగతించారు. అలా 'సీతారామ జననంలో అక్కినేని హీరో అయ్యారు. ఆ తర్వాత దుక్కిపాటి, బలరామయ్య, చల్లపల్లి రాజాలతో కలసి గూడవల్లి రామబ్రహ్మం దగ్గరకెళ్లి అక్కినేనిని 'మాయాలోకం'లో చిత్రానికి తీసుకొమ్మని సూచించారు. దుక్కిపాటి మధుసూదనరావు తనని అమ్మకన్నా మిన్నగా పెంచి పోషించిన సవతితల్లి "అన్నపూర్ణ" పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించారు. దానికి అక్కినేని నాగేశ్వరరావుని ఛైర్మన్‌ని చేశారు. ఆ సంస్థ ద్వారా తొలిసారి "దొంగరాముడు" చిత్రం నిర్మించారు. కె.వి. రెడ్డి దర్శకత్వంలో అక్కినేని, సావిత్రల జంట కన్నుల పండువుగా నటించడంతో అది ఘనవిజయం సాధించింది. దుక్కిపాటి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తోడికోడళ్ళు, మాంగల్యబలం, వెలుగునీడలు, చదువుకున్న అమ్మాయిలు, ఇద్దరు మిత్రులు, డాక్టర్ చక్రవర్తి, ఆత్మ గౌరవం, పూలరంగడు, విచిత్రబంధం, ప్రేమలేఖలు, రాధాకృష్ణ, పెళ్లీడు పిల్లలు, అమెరికా అబ్బాయి... వంటి అద్భుతమైన చిత్రాలెన్నో దుక్కిపాటి నిర్మించారు. డాక్టర్ చక్రవర్తి చిత్రం రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన తొలి నంది అవార్డును అందుకోవడం విశేషం. అధిక చిత్రాలు ఘనవిజయం సాధించాయనడంలో సందేహం లేదు. తెలుగులో ద్విపాత్రాభినయం చేసిన మొదటి సినిమా "ఇద్దరు మిత్రులు". అన్నపూర్ణ సంస్థ నిర్మించే సినిమాలకు ఎక్కువగా ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వం వహించేవారు. దుక్కిపాటి తన సినిమాలలో కొర్రపాటి గంగాధరరావు, యుద్దనపూడి సులోచనరాణి, గొల్లపూడి మారుతీరావు, ముప్పాళ్ల రంగనాయకమ్మ (సంభాషణల రచయిత్రి), కె.విశ్వనాథ్ (దర్శకుడు), ఆశాలత కులకర్ణి, జి. రామకృష్ణ, జీడిగుంట రామచంద్ర మూర్తి, శారద వంటి కళాకారులను పరిచయం చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి రావడానికి అక్కినేనితోపాటు దుక్కిపాటి మధుసూదనరావు ఎంతో కృషి చేశారు. అందుకే ప్రతిష్ఠాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డుతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ని సత్కరించింది. అలా దుక్కిపాటి, అక్కినేని ఇద్దరూ తమ సంబంధం, బంధం, అనుబంధం అద్వితీయం అని నిరూపించారు. దుక్కిపాటి 90 యేళ్ళ వయసులో 26 మార్చి, 2006 రోజున మరణించారు.



- కాసం ఏకసాయి
8885402108

# జేడీ వాన్స్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించిన ట్రంప్

- జేడీ వాన్స్ తెలుగమ్మాయి ఉష చిలుకూరి భర్త
- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉష చిలుకూరి
- కాలిఫోర్నియాలో జన్మించి... లీగల్ ఏజెన్సీలో లిటిగేటర్‌గా పని చేసిన ఉష
- భర్త జేడీ వాన్స్‌కు రాజకీయాల్లో తోడుగా ఉన్న ఉష





**కాలిఫోర్నియా:** అమెరికాలో తెలుగింటి అమ్మాయి ఉష చిలుకూరి ఇప్పుడు ఒక్కసారిగా వార్తల్లో నిలిచారు. అధ్యక్ష ఎన్నికల బరిలో రిపబ్లికన్ పార్టీ తరఫున డొనాల్డ్ ట్రంప్ పోటీ చేస్తుండగా, వైస్ ప్రెసిడెంట్ బరిలో జేడీ వాన్స్ ఉన్నారు. జేడీ వాన్స్ భార్య ఉష చిలుకూరి వాన్స్. జేడీ వాన్స్ ఓహియో రిపబ్లికన్ సెనేటర్. మిల్వాకీలో జరిగిన పార్టీ సమావేశంలో ట్రంప్... జేడీ వాన్స్ పేరును ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు. ఉష చిలుకూరి వాన్స్ నేషనల్ లీగల్ ఏజెన్సీలో లిటిగేటర్‌గా పని చేస్తూ ఎన్నో కేసుల్ని పరిష్కరించారు. ఆమె యేల్ యూనివర్సిటీ నుంచి చరిత్ర పాఠ్యాంశంగా బ్యాచిలర్ డిగ్రీని, కేంబ్రిడ్జ్ నుంచి మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని పొందారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జాన్ రాబర్ట్స్, బ్రెట్ కవనాగ్‌ల వద్ద ఆమె పని చేశారు. న్యాయశాస్త్ర రంగంలో విశిష్ట అనుభవాన్ని గడించారు. ఆమె తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లి అమెరికాలో స్థిరపడ్డారు. ఉష కాలిఫోర్నియాలో జన్మించారు. ఉష చిలుకూరి యేల్ జర్నల్ ఆఫ్ లా అండ్ టెక్నాలజీ మేనేజింగ్ ఎడిటర్, ది యేల్ లా జర్నల్ ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా సేవలు అందించారు. 2014లో ఆమె డెమోక్రాట్ పార్టీ సభ్యురాలు. కొన్నేళ్ల క్రితం ఆ పార్టీకి రాజీనామా చేసి రిపబ్లికన్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.

**భర్తకు రాజకీయాల్లో చేదోడుగా...**

ఉష, జేడీ వాన్స్ యేల్ లా స్కూల్‌లో కలుసుకున్నారు. 2014లో కెంటకీలో పెళ్లి జరిగింది. న్యూయార్క్ టైమ్స్ ప్రకారం వారి పెళ్లి హిందూ సంప్రదాయం ప్రకారం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. జేడీ వాన్స్ విజయంలో ఉష పాత్ర ఎంతో ఉంది. భర్త తరుచూ రాజకీయ కార్యక్రమాలకు వెళ్లేలా ప్రోత్సహించేవారు. ఆయనతో కలిసి వెళ్లేవారు. భర్త తీసుకునే రాజకీయ నిర్ణయాలకు మద్దతు ప్రకటించేవారు. సూచనలు చేసేవారు. జేడీ వాన్స్ 2016లో ఓహియో సెనేటర్‌గా పోటీ చేసినప్పుడు ఉష విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ట్రంప్ తమ పార్టీ ఉపాధ్యక్ష పదవికి జేడీ వాన్స్‌ను ఎంపిక చేసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయన అభ్యర్థిత్వాన్ని ధ్రువీకరించారు.

**భారత్‌తో సంబంధాలు మెరుగుపరచడంలో సహకారం**

అమెరికాకు చెందిన గ్లోబల్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్, ప్రముఖ ఎంటర్‌ప్రెన్యూయర్ ఒకరు ఏఎన్ఐతో మాట్లాడుతూ... ఉష వాన్స్ అత్యంత నిష్ణాతురాలైన న్యాయవాది అని తెలిపారు. ఆమెకు భారతదేశం గురించి, సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసునన్నారు. అమెరికాభారత్ మధ్య సంబంధాలను మరింత ముందుకు తీసుకువెళ్లడంలో ఆమె తన భర్తకు సహకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉష, వాన్స్ భిన్నమైన విశ్వాసాలు కలిగిన వ్యక్తులని అన్నారు.

**మంచి తల్లిదండ్రులు.. మంచి భర్త!**

ఆయన (జేడీ వాన్స్) ఎంత కష్టపడుతున్నాడో... ప్రజల కోసం ఎంతగా ఆలోచిస్తారో ప్రజలు అర్థం చేసుకుంటారని ఉష అభిప్రాయపడ్డారు. ఆయన ఎప్పుడూ మెరుగ్గా పని చేయడానికే ప్రయత్నిస్తాడన్నారు. తాను హిందూ కుటుంబంలో పుట్టానని... తన తల్లిదండ్రులను ఆ విశ్వాసం మంచి తల్లిదండ్రులుగా చేసిందన్నారు. జేడీ వాన్స్ కూడా ఏదో చేయాలనే తపనతో ఉన్నట్లుగా తనకు అనిపించిందని, అతని దారి సరైనది అనిపించిందని, అందుకే అండగా నిలబడ్డానన్నారు. జేడీ వాన్స్ ఓహియోలోని మిడిల్‌టన్‌లో జన్మించారు. కఠినమైన ఆర్థిక పరిస్థితుల మధ్య పెరిగాడు. వాన్స్ తండ్రి చిన్నప్పుడే వారిని వదిలి వెళ్లిపోయాడు. తల్లి మాదకద్రవ్యాల అలవాటుతో పోరాడింది. దీంతో జేడీ వాన్స్ తాతయ్య వద్ద పెరిగాడు.



## నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

**విశ్వంభర, కూకట్ పల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా కెపిహెచ్బి కాలనీలోని పలుచోట్ల గార్బేజ్ పాయింట్లను ఎంచుకొని మొక్కలు నాటింది. గార్బేజ్ పాయింట్ల వద్ద చెత్తవేయకుండా ఉండడంతోపాటు పచ్చదనం పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రభుత్వం ఆలోచన చేయడంతో ప్రారంభమైంది. కానీ విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన, పాయింట్ వద్ద స్థానిక వ్యాపారులు మొక్కల చెత్తను పారవేస్తూ జిహెచ్ఎంసి అధికారులకు సవాల్ విసురుతున్నారు. ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టిన కొందరిలో మార్పు రావడం లేదు. జిహెచ్ఎంసి అధికారులు కఠినమైన చర్యలు తీసుకుంటేగాని పరిస్థితి మారదు అన్న చందంగా కొన్నిచోట్ల కనిపిస్తుంది. ఒకే రోజులో మొక్కలు నాటిన ప్రాంతంలో చెత్త వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు సైతం ముక్కున మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్ల పక్కన చెత్త పేరుకుపోవడంతో వాహనాలు కూడా నిమ్మదించడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఇప్పటికే ఫుట్ పాత్ ఆక్రమణలకు గురైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కల్పించుకొని జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నాటిన మొక్కలను సంరక్షించి భావి తరాలకు అందజేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎస్ఐ వెంకటేశ్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు




**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్‌ను కాంగ్రెస్ నాయకులు విజయ్ రాథోడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సైకి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో సాయి, పవన్, భాస్కర్, శ్రీను తదితరులు ఉన్నారు.

## బోనాలకు ఏర్పాట్లు చేయాలి

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**విశ్వంభర, కూకట్ పల్లి :** బోనాల పండుగ సందర్భంగా కూకట్ పల్లి చిత్తరమ్మ తల్లి దేవాలయంని మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండుగ రోజు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, చిన్న, తులసి తదితరులు పాల్గొన్నారు.

## సోదర భావంతో మొహరం జరుపుకోవాలి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** సోదరభావంతో మొహరం పండుగను జరుపుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మోహరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మొహర్రం పండుగ త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక అని, విశ్వాసం, నమ్మకం కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవటమే మొహరం పండుగ ప్రత్యేకతన్నారు. మానవజాతి త్యాగం ఎంతో గొప్పదని మంచితనం, త్యాగాన్ని గుర్తు చేసుకోవటమే ఈ పండుగ యొక్క ప్రత్యేకతని పేర్కొన్నారు.

## గౌడ్‌ల సంక్షేమానికి సీఎం పాటుపడాలి

**గడ్డమీది అనురాధ గౌడ్**



**విశ్వంభర, బషీర్‌బాగ్ :** కోకాపేటలో గౌడ భవన నిర్మాణానికి భూమి కేటాయించి, 5 కోట్లు నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గౌడ మహిళా అధ్యక్షురాలు గడ్డమీది అనురాధ గౌడ్ అన్నారు. గౌడ్‌ల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో గౌడ్ లకు 10 లక్షల ఎక్స్గ్రేషియా పెంచుతామని హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గౌడ్ ల అందరికీ సేఫ్టీమోకులను వెంటనే అందించాలని కోరారు. వైన్ షాపుల కేటాయింపులో గౌడ్ లకు 25 శాతం కేటాయించాలని అన్నారు. గీత కార్పొరేషన్ వెంటనే పునరుద్ధరించి 2వేల కోట్లు నిధులు విడుదల చేసి చైర్మన్, డైరెక్టర్‌లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. తాటి, ఈత వనాల పెంపకానికి ప్రతి మండల కేంద్రంలో ఐదు ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. గీత వృత్తి ప్రమాదంలో వైకల్యం పొందిన గీత కార్మికులకు రక్షణకు వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక స్కీములను ప్రవేశపెట్టాలని కోరారు.

## డ్రగ్స్ నిర్మూలిద్దాం సమాజాన్ని మేలుకోలుపుదం

**చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్**



**విశ్వంభర, ముషీరాబాద్ :** డ్రగ్స్, మత్తు పదార్థ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, గాంధీ హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ ఎం రాజారావు అన్నారు. "డ్రగ్స్ నిర్మూలిద్దాం సమాజాన్ని మేలుకొలుపుదాం" ప్రజానాట్యమండలి ఫోటో ఎగ్జిబిషన్‌ను చిక్కడపల్లి ఏసీపీ ఎల్ రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ముషీరాబాద్ నియోజకవర్గంలోని రాంనగర్ డివిజన్ సెయింట్ పాయిస్ స్కూల్లో డ్రగ్స్ మత్తు పదార్థాల ప్రమాదాన్ని వివరించే ఫోటో ఎగ్జిబిషను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ మారన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, పట్నం సంస్థ రాష్ట్ర కార్యదర్శి డిజి నరసింహారావు, గాంధీ హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ ఎం రాజారావు, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లిండ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ కుమార్, గాంధీ హాస్పటల్ సూపర్డెంట్ డాక్టర్ ఎం రాజారావు, పట్నం సంస్థ రాష్ట్ర కార్యదర్శి డిజి నరసింహ మాట్లాడుతూ.. సమాజంలో యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. మారుతున్న పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతూ చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ముఖ్యంగా యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజ హితం కోసం కృషి చేయాలన్నారు. దానికై ప్రతి ఒక్కరికి ప్రత్యేక అవగాహన కల్పిస్తూ మత్తు పదార్థాలు సేవిస్తే ఏ విధమైనటువంటి దుష్ప్రభావలు కలుగుతాయో యువతకు వివరిస్తూ వాటిని దూరంగా ఉండే విధంగా ప్రోత్సహించడంలో ముఖ్యపాత్ర తల్లిదండ్రులు పోషించాలని కోరారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నత పరువులుగా అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్నం సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామేష్ బాబు ప్రజానాట్యమండలి సహాయ కార్యదర్శి కళ్యాణ్, కోశాధికారి ప్రజానాట్యమండలి నాయకులు పీ సునీత, ఎన్ శిరీష, పి మల్లేష్, మహారాజు, సెయింట్ పాయిస్ స్టాఫ్ సెక్రటరీస్ రీటా, జయంతి, రెజీనా తదితరులు పాల్గొన్నారు.


## యాదగిరిగుట్టలో సాంస్కృతిక పోటీలకు గట్టిప్పలపల్లి విద్యార్థులు ఎంపిక



విశ్వంభర, ఆమనగల్లు : తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పూజ, నందిని, వాణి, రాష్ట్రస్థాయి సంస్కృతిక పోటీలకు ఎంపికైన సందర్భంగా 20వ తేదీన యాదగిరిగుట్టలో ప్రదర్శన చేయనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రేణు రెడ్డి విద్యార్థుల తోపాటుగా విద్యార్థుల ప్రతిభను వెలికి తీసిన డాన్స్ కొరియోగ్రాఫర్ శేఖర్‌కు సన్మానం చేసి 10000 రూపాయల ప్రోత్సాహకం అందజేశారు. అనంతరం రేణు రెడ్డి మాట్లాడుతూ గట్టు ఇప్పలపల్లి నుంచి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో జరగనున్న సంస్కృతిక కార్యక్రమాలకు ఎంపిక కావడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న చిన్నారులు ఎంపిక కావడం తమ గ్రామానికి ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రతిభ చూపుతున్న గవర్నమెంట్ పాఠశాలలో చదివిన చిన్నారులకు తమ వంతు సాయం ఎప్పటికీ ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇంగ్లీష్ మీడియం కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, శెట్టి రాజశేఖర్, కిషన్, వాల్మీకి, దేశముని రాములు, నరేందర్ గౌడ్, శివ గౌడ్, జక్కుల మల్లేష్, మచ్చేందర్, రాహుల్, పవన్ వాల్మీకి, శివశంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్ నుంచి శ్రీశైలానికి టీడీపీ నాయకుడి పాదయాత్ర

**విశ్వంభర, ఆమనగల్లు** : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు పదవి చేపడితే చిలుకూరి బాలాజీ టెంపుల్ నుంచి శ్రీశైలం ఆలయం వరకు పాద యంత్ర చేస్తానని మొక్కుకున్న మొయినాబాద్ మండలం పెదమంగళారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఎల్లమోని యాదయ్యగౌడ్ 14 తేదీ నుంచి పాదయాత్ర మొదలు పెట్టి 16 నాడు ఆమనగలులో అడుగుపెట్టిన పందర్భంగా మండలంలోని కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి అడ్వకేట్ యాదిలాల్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొప్పు యాదయ్య, టిడిపి సీనియర్ నాయకులు గాజుల పద్మనాభం, గుండమల్ల జగన్, బాబా, అధ్యక్షులు పాండు, కిష్టయ్య, జంగయ్య గౌడ్, రహీం, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ ఉపాధి 14 విడత సామాజిక తనిఖీలు



**విశ్వంభర, చివ్వేంల :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ 14 వ విడత సామాజిక తనిఖీల నివేదికలపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రజావేదికను నిర్వహించారు. డీఆర్డీవో పీడీ మధుసూదనరాజు సమక్షంలో మండలంలోని అన్ని గ్రామాల్లో 1 ఏప్రిల్ 2023 నుంచి మార్చి 31 2024 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన నివేదికలను గ్రామాల వారీగా డీఆర్పీలు చదివి వినిపించారు. అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ పనులు సక్రమంగా చేయాలని పీడీ మధుసూదనరాజు అన్నారు. కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ లు సంతకాలు లేకుండా పేమెంట్ చేస్తున్నారని అలా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంబీ రికార్డు నిర్వహణ సరిగా లేదని కొలతల వారీగా రికార్డ్ చేయాలి గుండుగుత్తగా చేయొద్దని ఆదేశించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. రోజ్‌గార్ యోజన రికార్డుల సరిగా లేదని, తప్పకుండా చేయాలి లేదంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి రూ. 3,83,804 రికవరీ చేయాలని ఏపీవో, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్ లు, ఫీల్డ్ అసిస్టెంట్ లు, పంచాయతీ కార్యదర్శుల నుంచి రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా చందుపట్లలో రూ. 75 వేలు తేల్చారు. మండలంలోని చందుపట్ల, ఐలాపురం, మున్యా నాయక్ తండా, లక్ష్మన్ నాయక్ తండా, తీర్మలగిరి, గుంపుల, గుంజలూర్, చివ్వేంల, గుడి తండా, హలవత్ తండా, రోళ్లబండ తండా, అక్కలదేవిగూడెం, పులి తండా, బాధ్య తండా, వట్టి ఖమ్మం పహాడ్, తదితర గ్రామాల్లో కూలీలు చేపట్టిన పనులతో పాటు హాజరైన కూలీలు, అవెన్యూ ప్లాంటేషన్లలో నాటిన మొక్కలు, ప్రస్తుతం ఉన్న మొక్కల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్ మెన్ లచ్చిరాం నాయక్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఎస్సార్పీ సాంబాచారి, విజిలెన్స్ అధికారులు లింగారెడ్డి, ఆశా కుమారి, ఏపీఓ నాగయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో అరుణాచల అర్చకుల పూజలు



**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని తమిళనాడు రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన అరుణాచల ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయన శర్మ దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో అభిషేకం, అమ్మవారి ఆలయంలో దర్శనం అనంతరం అర్చక స్వాములు స్వామివారి శేష వస్త్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం

**విశ్వంభర, ఆమనగల్లు :** మొహరం సాంప్రదాయ సంతాపదినాలను పురస్కరించుకొని మంగళవారం తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలోని పీర్ల చావిడిలో ప్రతిష్టించిన పీర్లను కల్వకుర్తి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ సందర్శించి దట్టీలు సమర్పించారు. సామరస్యతకు ప్రత్యేకగా మొహర్రం సంతాప కార్యక్రమాలు కొనసాగుతాయని, పండుగ రోజు హిందువులు, ముస్లింలు భక్తిశ్రద్ధలతో పాల్గొని మొహరం వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, ఖాజా, శ్రీరాం, శ్రీకాంత్, రమేష్, బాబా, రఫీ, పరంధాములు, ముజ్జు, శేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులవి

# మతిలేని వ్యాఖ్యలు

- కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని అన్ని పార్టీల నేతలు కలుస్తారు.. అందులో తప్పేముంది..?
- కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్డీఏ ప్రధానిని ఎందుకు కలుస్తున్నారు..?
- స్వార్థ రాజకీయాల కోసం మతాన్ని అడ్డుపెట్టుకొని, ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టడానికి కాంగ్రెస్ బీఆర్ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయి
- మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ వ్యాఖ్యలు



**విశ్వంభర, కరీంనగర్ :** కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను అన్ని పార్టీల నేతలు కలుస్తుంటే, కొంతమంది కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అక్కసు వెళ్లగకుతున్నారని, తమ స్వార్థ రాజకీయాల కోసం బండి సంజయ్ కుమార్‌పై పనికిమాలిన విమర్శలు చేస్తూ ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈద్గా, మసీదుల విషయంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడిన వ్యాఖ్యలను కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వక్రీకరించి ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు చేయడం మంచిదికదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలు, ఇతర పార్టీల నేతలు కలుస్తున్నారన్నారని, ఇందులో ముఖ్యంగా కరీంనగర్ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందించాలని కేంద్ర మంత్రిని కోరుతు అనేకమంది విజ్ఞప్తులు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎన్డీఏ, బీజేపీ ప్రధాని మోదీని ఎందుకు కలుస్తున్నారో అలాగే ఇతర పార్టీల నేతలు కూడా కేంద్రమంత్రి బండి సంజయ్‌ని కలిస్తే దాన్ని కూడా రాజకీయం చేయడం అవివేకమన్నారు. ఇందులో కేవలం ఎంఐఎం, బీజేపీ టార్గెట్‌గా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకునే పరిస్థితుల్లో లేరని, రెండు పార్టీలు కలిసిపోయాయని, కేవలం బిజెపి లక్ష్యంగా పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు మతిభ్రమించి పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎంఐఎంల కే స్నేహపూర్వక బంధాలు ఉన్నాయని, అందుకే పనిగట్టుకొని బిజెపిపై, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతోనే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్ని వర్గాల అభివృద్ధి శ్రేయస్సు కోసం కృషి చేశారని, అందుకోసమే రెండవసారి కూడా భారీ మెజారిటీతో గెలుపొందారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మత రాజకీయాలు చేయడం మానుకోవాలని, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు.




## జిల్లా పరిధిలోని పోస్టులకు కౌన్సిలింగ్

### అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సీనియారిటీ ప్రాతిపదికన జిల్లా పరిధిలోకి వచ్చే పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా పరిధిలోకి వచ్చే జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, కార్యాలయ సబార్డినేట్ల బదిలీల ప్రక్రియకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లా పరిధిలోకి వచ్చే పోస్టులకు బదిలీలు చేయాల్సి ఉన్నందున ఆయా శాఖల అధికారులు అందచేసిన జాబితా మేరకు ఒకే చోట నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్న వివిధ శాఖల్లో పని చేసే జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, కార్యాలయ సబార్డినేట్లు ఇచ్చిన ఆప్షన్ మేరకు కోరుకున్న స్థానాలకు పారదర్శకంగా బదిలీలు చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం నిర్వహించిన కౌన్సలింగ్‌కు అందుబాటులో లేని సిబ్బంది ఈ నెల 18న మరోసారి కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు వారి కార్యాలయ సిబ్బంది 28వ తేదీ గురువారం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు తప్పని సరిగా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి కౌన్సెలింగ్ సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొహరం శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి :** ముస్లింలకు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ మొహరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మొహర్రం పండుగ త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక అని, విశ్వాసం, నమ్మకం కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవటమే మొహరం పండుగ ప్రత్యేకతని అన్నారు. మానవ జాతి త్యాగం ఎంతో గొప్పదని మంచితనం, త్యాగాన్ని గుర్తు చేసుకోవటమే ఈ పండుగ యొక్క ప్రత్యేకతని కలెక్టర్ పేర్కొన్నారు.

### బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశంలో జడ్పీహెచ్ఎస్ వీవీరావుపెట్ ప్రభంజనం



**విశ్వంభర, మల్లాపూర్ :** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వీవీరావుపేట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు 2024 సంవత్సరానికి గాను ట్రిబుల్ ఐటిలో ప్రవేశ అర్హత సాధించారు. 9.7 జీపీఏ సాధించిన ఘన, వేణి, రిషిక ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన సందర్భంగా పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిబుల్ ఐటీ సాధించడానికి కారణమైన ఉపాధ్యాయ బృందానికి విద్యార్థులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండూర్ మండలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల హామీని విస్మరించి రైతులను మోసం చేసిందని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల పాండు రంగా రెడ్డి అన్నారు. వారు మంగళవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బిజెపి కిసాన్ మోర్చా నాయకులతో కలిసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని అన్నారు.

## ఏలాంటి షరతులు లేకుండా రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

### బీజేపీ మండలాధ్యక్షుడు గజరాజు కాశీనాథ్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ ఆత్మకూరు(ఎం) మండల పార్టీ అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ ఎటువంటి షరతులు లేకుండా మాఫీ చేయాలి. ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి కండిషన్ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బండారి సత్యనారాయణ, మండల కార్యదర్శి బూడిద నరసింహాగౌడ్, ఎస్సీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి మధు, మండల సోషల్ మీడియా కన్వీనర్ సాయి, బూత్ అధ్యక్షులు లోడి వెంకటయ్య, సీనియర్ నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు.



## రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు




### ఆర్డీఓ శ్రీనివాసరావు

**విశ్వంభర, హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని రేషన్ డీలర్ల సమీక్షలో భాగంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా పాటుబడితే డీలర్లకు డీలర్ షిప్ రద్దుచేస్తూ.. కేసు నమోదు చేస్తానని ఆర్డీఓ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఇదే విషయమై హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు రేషన్ బియ్యం పంపిణీ ఎవరైనా అక్రమం చేసిన, ప్రోత్సహించిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని 350 మంది రేషన్ డీలర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ, సీఐ, సివిల్ సప్లై అధికారులు నియోజవర్గ స్థాయిలోని ఎమ్మార్వోలు తదితరులు పాల్గొన్నారు. రేషన్ డీలర్లు సివిల్ సప్లై గోడౌన్స్ నుంచి డీలర్లకు సప్లై చేసే బియ్యం తూకంతేడా ఉంటుంది. కొన్ని బస్తాల్లో ఆరు నుంచి ఏడు కేజీలు తక్కువగా వస్తున్నాయని, చాలీచాలని జీతాలతో జీవనం వెళ్లదీస్తున్నామని డీలర్లు ఆవేదన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనాన్నిఇస్తూ తమను ప్రోత్సహించాలని డీలర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. సివిల్ సప్లై అధికారులు, ఆర్డీఓ, సీఐ ఆజ్ఞ మేరకు డీలర్లు అందరం కట్టుబడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో హుజూర్నగర్ డీటీ, సివిల్ సప్లైరాజశేఖర్, అప్పారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే మీడియా గొంతు నొక్కడం సరికాదు




**విశ్వంభర, మేడిపల్లి :** ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న నిరుద్యోగుల న్యూస్ కవరేజ్‌కి వెళ్ళిన జీ న్యూస్ తెలుగు రిపోర్టర్ శ్రీ చరణ్‌ను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం తీవ్రమైన ఘటనగా భావిస్తున్నామని, ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండే మీడియా గొంతు నొక్కడం సరికాదని జగిత్యాల జిల్లా మేడిపల్లి భీమారం మండలాల ఉమ్మడి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు.

ఘటనకు బాధ్యులైన పోలీస్ అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముందు ముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. లేనిపక్షంలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నోముల నరసింహారెడ్డి, పుప్పాల రాంరెడ్డి, మార్గం మహేష్, ఎదులాపురం దయాకర్, చింతకింది లక్ష్మీపతి, పల్లికొండ గణేష్, అందే అశోక్, మామిడి ఆంజనేయులు, నీలగిరి ప్రవీణ్ రావు, చిరుమల్ల వజ్ర లింగం, బక్కురి నరేష్, ఎండి రఫీ, మారంపల్లి సురేష్, ఎండి రహీం, కుందారపు ప్రభాకర్, వెల్మలపల్లి చిరంజీవి, బొంగొని మల్లేశం గౌడ్, గొడికే సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ ల్యాండ్‌లో జేసీబీపై కేసు నమోదు

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



**విశ్వంభర, పెద్దపల్లి :** ఫారెస్ట్ ల్యాండ్‌లో అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తీస్తున్న ఓ జేసీబీపై ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామ శివారులోని ఫారెస్ట్ ల్యాండ్ నుండి జేసీబీతో మట్టి తీన్నారన్న సమాచారం మేరకు తాము పట్టుకొని అటవీ శాఖ చట్టాలు 20, 29, 44 ల క్రింద కేసు నమోదు చేశామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఇదే జేసీబీపై గతంలో 84,000/ రూపాయల జరిమానా విధించామని అధికారులు తెలిపారు. ఇట్టి జేసీబీ యజమానిపై కూడా గతంలో ఫారెస్ట్ అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించిన తీరుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదే విషయం ఫారెస్ట్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంతో కలెక్టర్ కూడా సీరియస్‌గా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలిచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

## ఉచిత హామీలను కొంతమందికే కట్టబెడుతున్న కాంగ్రెస్ పాలన

### సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా నాగు నాయక్



**విశ్వంభర, చివ్వేంల :** ఉచిత హామీలను కొంతమందికే కాంగ్రెస్ పార్టీ కట్టబెడుతుందని సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య నాగు నాయక్ అన్నారు. మంగళవారం మొగ్గయ్య గూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. ప్రజా పాలన అంటూ ఎలక్షన్ల ముందు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని నొక్కి పలికి అధికారంలోకి వచ్చాక ఊసరవెల్లి రంగులు మారిసినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఆరోజు తెలంగాణ రాష్ట్ర రైతన్నలందరికీ రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి ఈరోజు రేషన్ కార్డు అనే సాకుతో అనేకమంది రేషన్ కార్డు లేని లక్షల పేద రైతులను ఆదుకోలేక వారిని ఇంకా అప్పుల ఊబిలో నెట్టేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో ఉన్న రైతాంగం పట్ల ప్రేమ చూపాలి తప్ప ఈ విధంగా కక్ష సాధింపు చేసుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ నాయక్, రాజా, సాయి, గోపి, దినేష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ టాక్స్ కట్టాలని టోకరా

విశ్వంభర, ఆత్మకూరు(ఎం) : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ టాక్స్ కట్టాలని మోత్కూర్ మున్సిపల్ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓ వ్యాపారికి కేటుగాడు రూ.16 వేలకు టోకరా పెట్టాడు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన ఓ వ్యాపారికి సోమవారం మధ్యాహ్నం ఒక కేటుగాడు ఫోన్ చేసి మోత్కూర్ మున్సిపల్ ఆఫీస్ నుంచి (నంబర్ 8867046811) ఫోన్ చేస్తున్నాని, తన పేరు శ్రీనివాస్‌రావు అని చెప్పుకుని మీ షాపు ట్రేడ్ లైసెన్స్, లేబర్ లైసెన్స్ టాక్స్ కట్టాలని చెప్పాడు. వ్యాపార బిజీలో ఉన్న ఆ వ్యాపారి మోత్కూర్ మున్సిపల్ ఆఫీస్ అని చెప్పడంతో నమ్మి ఫోన్ పే నంబర్ 7987165235కి ట్రేడ్ లైసెన్స్ కోసం రూ.9950, లేబర్ లైసెన్స్ కు రూ.6250 కొట్టాడు. ఆ తర్వాత తేరుకుని 8867046811 నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. డబ్బులు కొట్టిన ఫోన్ పే నంబర్ 7987165235 కి ఫోన్ చేయగా హైదరాబాద్ చాంద్రాయణగుట్ట అని, ఎవరో ఇక్కడ చాయ్ తాగి తెలిసిన వాళ్లు డబ్బులు కొడతారని చెప్పి డబ్బులు రాగానే తీసుకుని వెళ్లిపోయాడని చెప్పాడు. దీంతో ఆ వ్యాపారి సైబర్ క్రైమ్ 1930కి కాల్ చేసిన అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ ఆఫీస్ పేరు చెప్పి వ్యాపారికి కేటుగాడు టోకరా వేసిన విషయం తెలియడంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తమ సిబ్బందికి గాని లేదా నేరుగా కార్యాలయంలో గాని ప్రజలు పన్నులు కట్టి రసీదులు తీసుకోవాలని కోరారు.

## ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోండి



**విశ్వంభర, మెట్పల్లి :** అసలే వర్షాకాలం ఆపై విష జ్వరాలు డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఎత్తున ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తే మెట్పల్లి పట్టణం జాతీయ రహదారి ప్రక్కన గల మురుగు కాలువ నీరు నిలిచి దోమలు, కీటకాలకు నిలయంగా మారింది. ప్రభుత్వ దవాఖాన గేటు పక్కనే గల మురికి కాలువలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ భయభ్రాంతులకు గురిచేస్తుంది. ప్రజలు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మురుకు కాల్వలో ఉండడం దానికి రక్షణగా ఉన్న కంచ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి, ట్రాన్స్ఫార్మర్ యొక్క ఎర్తింగ్ వైరు మురుగు కాల్వకు ఆనుకుని ఉండడంతో అనుకోకుండా విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు మరియు విద్యుత్ శాఖ అధికారులు ఏ అపాయం జరుగక ముందే స్పందించి సమస్యపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- డ్రగ్స్‌పై సైబరాబాద్ పోలీసులకు అవగాహన సదస్సులో డీసీపీ సృజన








**విశ్వంభర, హైదరాబాద్** : మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ (W& CSW) డీసీపీ సృజన కర్ణం అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం మాదకద్రవ్య వినియోగంపై సైబరాబాద్ పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సృజన మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. డ్రగ్స్ సరఫరా చేసేవారి ఆట కట్టించడానికి పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నామన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదుల కోసం 87126 71111 ఫోన్ నంబర్‌కి సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

అమృత ఫౌండేషన్ NGO డైరెక్టర్ మరియు పరిశోధక సైకాలజిస్ట్ దేవికా రాణి కూడా ఈ సమస్యను ఉటంకిస్తూ.. "యువతులు మత్తుపదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మాదకద్రవ్యాల వినియోగం వారి భవిష్యత్తులను అంధకారంగా మారుస్తుంది, వారు ఇలాంటి పదార్థాలకు దూరంగా ఉండాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ఉమెన్ & చైల్డ్ సేఫ్టీ డీసీపీ సృజన కర్ణం, అమృత ఫౌండేషన్ ఎన్‌జిఓ డైరెక్టర్ మరియు పరిశోధక సైకాలజిస్ట్ దేవికా రాణి, W& CSW ఏసీపీ ప్రసన్న కుమార్, ఇన్ స్పెక్టర్ సునీత, AHTU ఇన్ స్పెక్టర్ జేమ్స్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**విశ్వంభర, కూకట్ పల్లి** : కూకట్ పల్లి నియోజకవర్గంలో 235 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ 100116 / రూపాయల చెక్కులను మంగళవారం కె.పి.హెచ్.బి మండల కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద మధ్యతరగతి కుటుంబాల్లో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు సంతోషాన్ని నింపుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, పండాల సతీష్‌గౌడ్, ముద్దం నర్సింగ్ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, సబేహా గౌసుద్దీన్, పీ శిరీషాబాబురావు, మహేశ్వరీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# ట్రైకార్ కార్యాలయంలో రివ్యూ

**విశ్వంభర, హైదరాబాద్** : ట్రైకార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ట్రైకార్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ రివ్యూ నిర్వహించారు. ట్రైకార్లో అమలవుతున్న స్కీములు, వాటి పరిస్థితి, పెండింగ్లో ఉన్న బిల్లులు, ఏ ఏ పథకాలు అమలవుతున్నాయి ? గత సంవత్సరం బడ్జెట్లో ఎంత రిలీజ్ అయింది, ఇంకా ఎంత గ్రౌండ్ కావాల్సిన అవసరం ఉంది, అన్ని వివరాలను సమీక్షించారు. పథకాలను విస్తృతంగా ప్రచారం జరిగేటట్టు చూసుకోవాలని, సబ్సిడీల బడ్జెట్ పెంచాలని, పథకాలు అందేటట్టు చూసుకోవాలని, షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వమిచ్చిన బడ్జెట్ను పూర్తిగా గిరిజనులకు అందేటట్టు చూసుకోవాలని, త్వరలోనే ఫీల్డ్ విజిట్ కు పోదామని అధికారులను సూచించారు. వీలైనన్ని ఎక్కువసార్లు అటు ఫీల్డ్ విజిట్ ఇటు సమీక్ష ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవడం, కేంద్రం నుంచి వచ్చే నిధులను వాడుకోవడం వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని సాధించడం, ట్రైకార్ పథకాలన్నీ 100% అమలు అయ్యేటట్టు చూసుకోవడం ప్రధాన ఎజెండాగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ట్రై కార్ జీఎం శంకర్ రావు, డిప్యూటీ జీఎం లక్ష్మీ ప్రసాద్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య విలువ లేకుండా చేస్తున్న కాంగ్రెస్



## ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ

**విశ్వంభర, ఎల్బీనగర్** : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్య విలువలు అడుగంటి పోతున్నాయని, విలువ లేకుండా పాలన చేస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ అన్నారు. సోమవారం ఖిల్లా మైసమ్మ దేవాలయం ఆవరణలో బోనాల చెక్కుల పంపి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్ పాటించకుండా చెక్కులను పంపిణీ చేయడానికి వ్యతిరేకిస్తూ మంగళవారం గ్రీనీహిల్స్ కాలనీలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరవింద శర్మ మాట్లాడారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా సేవలందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని కాంగ్రెస్ నాయకులు అవమానించారని, ప్రజాస్వామ్యంలో ఓటమిపాలైన కిచెన్నగారి లక్ష్మారెడ్డిని ప్రోటోకాల్ లేకున్నా ప్రభుత్వ కార్యక్రమాల్లో స్టేజి పైకి పిలిచి చెక్కులు పంపిణీ చేయించడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, ప్రజాపాలనలో కాంగ్రెస్ నాయకులు తెచ్చిన మార్పు ఇదేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిత్యం అత్యాచారాలు, దోపిడీలు జరుగుతుంటే ఈ ప్రభుత్వం కళ్లు మూసుకొని పరిపాలన చేస్తుందని విమర్శించారు. నిరుద్యోగులంతా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వం వారిని నిర్ధక్షిణంగా అనగదొక్కేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్న ఒక్క హామీని కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు.

పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణలో సంపద సృష్టించి దేశంలోని నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు వెంటనే ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మీ నరసింహ రెడ్డి, బడంగ్ పేట కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ సురకంటి అర్జున్, బడంగ్ పేట కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, నియోజకవర్గ ఉద్యమకారుల కన్వీనర్ న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, బడంగ్ పేట కార్పొరేటర్ ఏనుగు రామ్ రెడ్డి, నాయకులు ఆకుల అరవింద్, కొండ్ర శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ



**విశ్వంభర, హైదరాబాద్** : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 535 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 116, పౌరసరఫరాల శాఖ కు సంబంధించి 88, విద్యుత్ శాఖకు సంబంధించి 62, హౌజింగ్‌కు సంబంధించి 57 దరఖాస్తులు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబందించి 36, ఇతర శాఖలకు సంబంధించి 176 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

# ఘనంగా అదనపు సంచాలకుడు లక్ష్మణుడు జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఎల్బీనగర్** : తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ అదనపు సంచాలకులు ఆర్ లక్ష్మణుడు జన్మదినం పురస్కరించుకొని టీఎన్జీవోస్ ఎఎంసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలుక నరసింహారెడ్డి, కార్యదర్శి ముక్రం ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చిలుక నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఆర్ లక్ష్మణుడు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతశ్రేణి కార్యదర్శిలు రాహుల్, జి.. రెడ్డి, వెంకన్న, సెంట్రల్ యూనియన్ ఈసీ మెంబర్ ఎన్ సంతోష్ కుమార్, ఖలీదు, భాస్కర్, రాజేందర్, జీవన్, వెంకట రెడ్డి, విజయ కిషోర్, రాజకుమార్, కాజా, సత్యనారాయణ, ఇతర మార్కెట్ కమిటీ ఉద్యోగులు, జిల్లాల సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధి శాఖ జీపీగా న్యాయవాధి గడ్డం కిరణ్ నియమితులైన సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలుపుతున్న రంగా రెడ్డి జిల్ల కోర్టు న్యాయవాదులు రంగా ప్రవీణ్ కుమార్, పూర్ణచంద్రారెడ్డి, పైల్ల అరవిందారెడ్డి.

- విశ్వంభర, ఎల్బీనగర్

# మత్స్య దర్శినిని సందర్శించిన ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్



**విశ్వంభర, హైదరాబాద్** : తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ ( TGFCOF) చైర్మన్ మెట్టు సాయి కుమార్ బంజారాహిల్స్‌లోని మత్స్య దర్శినిని మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయన అక్కడున్నటువంటి చేపలను, మత్స్య సంపదను పరిశీలించారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్స్య దర్శిని (ఫిష్ మార్కెటింగ్ కాంప్లెక్స్)లో కలియ తిరిగారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో మత్స్య దర్శిని బలోపేతానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొనుగోలుదారులు మత్స్య దర్శిని సందర్శించి కావాల్సిన మత్స్య సంపదను కొనుక్కోవచ్చని, ఇక్కడ నాణ్యమైన చేపలు, రొయ్యలు, పీతలతో పాటు రకరకాలైన చేపలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చేపలను క్రమం తప్పకుండా ఆహారంలో భాగంగా తీసుకుంటే డయాబెటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి వ్యాధులు దరిచేరవని పేర్కొన్నారు.

చేపల ద్వారా లభించే పోషకాలు శరీర సమతుల్యతను కాపాడతాయన్నారు. చేపల ఆహారం వల్ల జీవక్రియ పెరిగి, చర్మం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. చేపలను క్రమం తప్పకుండా తీసుకుంటే నిద్రలేమి సమస్యలు దూరం అవుతాయని, ఏకాగ్రత వంటివి పెరుగుతాయని చైర్మన్ సాయి కుమార్ స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలి

## కార్పొరేటర్ బద్దం ప్రేంమహేశ్వర్ రెడ్డి



**విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్** : గడ్డిఅన్నారం డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేంమహేశ్వర్ రెడ్డి జలమండలి 10ఏ డివిజన్ జనరల్ మనగర్ బలరామరాజుకి వినతిపత్రం అందజేశారు. HMWSSB కార్యాలయంలో మర్యాదపూర్వకంగా జలమండలి 10ఏ డివిజన్ జనరల్‌ను కార్పొరేటర్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గడ్డిఅన్నారం డివిజన్‌లో అనేక ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు ధ్వంసమై దర్శనమిస్తున్నాయని వెల్లడించారు. అదేవిధంగా తాగునీటి సరఫరాలో కలుషిత నీరు వస్తుందని ఫిర్యాదు చేశారు. తక్షణమే డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి యుజిడి, తాగునీటి పైపులైన్ల నిర్మాణాలను పునరుద్ధరింప చేయాలని కోరినట్లు వారు తెలిపారు. డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి 10ఏ డివిజన్ డిప్యూటీ జనరల్ మనగర్ సరిత తదితరులు పాల్గొన్నారు.





ప్రభుత్వ నీలోఫర్ హాస్పిటల్ హైదరాబాద్‌లో మంగళవారం చిన్న పిల్లలకు ఐసీయూలో అవసరమైన గాలి పీల్చుకోవడానికి ఉపయోగపడే రూ.60,000/- విలువ గల 20 ఐటమ్స్ డొనేట్ చేశారు.

- విశ్వంభర, హైదరాబాద్

# బోనాల ఉత్సవాల ఏర్పాట్లకు నిధులు మంజూరు

**విశ్వంభర, ఎల్బీనగర్** : ఆషాఢమాసం బోనాలను పురస్కరించుకొని మన తెలంగాణ ప్రభుత్వం అమ్మవారి దేవాలయాలకు అందజేస్తున్న ఆర్థిక సహాయంలో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని దేవాలయాల కమిటీలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఎల్బీనగర్ శ్రీ ప్రసన్నాఆంజనేయ స్వామి దేవాలయం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు శ్రీ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి దేవాలయాల కమిటీ ప్రతినిధులకు మన ప్రభుత్వం అందజేస్తున్న బోనాల ఉత్సవాల ఏర్పాట్లకు మంజూరైన చెక్కులను దేవాలయాల కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్, కొప్పుల నరసింహా రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, బానోత్ సుజాతా నాయక్, నాయకోటి పవన్ కుమార్, బీఎన్ రెడ్డి మాజీ కార్పొరేటర్ శ్రీమతి ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, మంజులా రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, కుట్ల నరసింహా యాదవ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, బండ సురేందర్ రెడ్డి, ఇంకా పలువురు నాయకులు, ఆలయ కమిటీల ప్రతినిధులు, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

## ఎస్ఎఫ్ఐ డిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్** : జూన్ మాసంలో ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలో నేటికి కూడా సమస్యలకు నిలయగా మారినై అన్నారు. ఈ సందర్భంగా సౌత్ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలు పేరుకే ఉన్నాయన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పాఠశాల అభివృద్ధి అవుతాయన్నారు. ఇప్పటికి పెండింగ్లో పనులు ఉన్నాయన్నారు. పాఠ్యపుస్తకాలు యూనిఫార్మ్స్ విద్యార్థులకు రాలేవన్నారు. విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. శ్రీనివాస్, రామకృష్ణ, ప్రశాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై ఉన్న అభిమానంతో కొత్తపేట బీజేపీ నాయకుడు తోట మహేందర్ యాదవ్ తన చేతిపై బండి సంజయ్‌కుమార్ టాటూను వేయించుకున్నారు.

- విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్



## మేయర్ సునీల్‌రావు వాఖ్యలను ఖండించిన సుడా చైర్మన్

**విశ్వంభర, కరీంనగర్ :** మొన్నటి వరకు ఎంపీగా బండి సంజయ్ కుమార్ విఫమలయ్యాడని, అసమర్థుడని కరీంనగర్ పట్టణ అభివృద్ధికి ఒక్క పైసా నిధులు తీసుకురాలేదని అభివృద్ధిపై అసలు అవగాహనే లేదని మాట్లాడిన మేయర్ సునీల్ రావు ఇప్పుడు పట్టణ అభివృద్ధికి బండి సంజయ్‌కుమార్ వందల కోట్ల నిధులు తీసుకు వచ్చిందని మాట్లాడిన తీరుకు ఊసరవెల్లులే సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నరేందర్ రెడ్డి మేయర్ సునీల్ రావు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పై గతంలో మాట్లాడిన వీడియోను ఇప్పుడు మాట్లాడిన వీడియోను చూపించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో విలువలు పాటించాలని పట్టణ ప్రథమ పౌరుడిగా ప్రజలకు ఆదర్శవంతంగా ఉండాలని రాజకీయాల పేరుతో ఎన్ని అబద్దాలైన ఆడవచ్చనేది కరెక్ట్ కాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రతి ఒక్కరం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని అందులో ఎటువంటి అనుమానం సునీల్ రావుకు అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు దన్న సింగ్, అబ్దుల్ రహేమాన్, షబానా మహమ్మద్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దాసరి నర్సింహ రెడ్డి, పెద్దిగారి తిరుపతి, మహమ్మద్ భారీ, కీర్తి కుమార్, కిరణ్ రెడ్డి, అష్రఫ్, ఖలీల్, నరేష్, జమీల్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి

**సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు**




**విశ్వంభర, సూర్యపేట్ :** కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రేషన్ కార్డులను మంజూరు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మ బిక్షం భవనంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డుల సమస్య చాలా పెద్ద సమస్యగా మారిందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల నుంచి రేషన్ కార్డులు జారీ చేయకపోవడం వల్ల లక్షలాది మంది పెళ్లైన దంపతులకు ఏ ప్రభుత్వం పథకం అందక చాలా దయనీయమైన పరిస్థితుల్లో బ్రతుకుతున్నారని కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు ఇస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారని అయినా అర్హులకు నిరాశ మిగిలింది అన్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరులో ప్రక్షాళన చేసి అర్హులకు అందేలా చేయాలని తెలిపారు. ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు అవుతున్న రేపు మాపని చెప్తుందే తప్ప ఇంతవరకు ముందుకు సాగలేదన్నారు. రేషన్ కార్డు జారీ చేయకుంటే దశలవారీగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ కార్యవర్గ సభ్యులు నిమ్మల ప్రభాకర్, కౌన్సిల్ సభ్యులు పెండ్ర కృష్ణ, కిట్టు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎంపీపీ, జడ్పీటీసీ ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆమనగల్లు :** తలకొండపల్లి మండలంలోని జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కల్వకోలు భాస్కరయ్య మృతి చెందిన విషయాన్ని ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్ ద్వారా తెలుసుకున్న తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి మూడు వేలు, తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్ మరో రెండు వేలు రూపాయలు కలిపి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిరుమణి నిర్మల శ్రీశైలంగౌడ్, మోహన్ రెడ్డి, మీసాల మధు, పసుల మల్లేష్, పబ్బతి మల్లేష్, మీసాల మహేష్, లక్ష్మయ్య, మల్లయ్య, పెంటయ్య, శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డిని మంగళవారం దోమ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బంగ్లా యాదయ్య గౌడ్, అతని కుమారుడు అభి గౌడ్, కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

- విశ్వంభర, దోమ

# మొహరంను తెలంగాణ సాంస్కృతిక పండుగ గుర్తించాలి

○ మొహరం నిర్వాహకుల సంఘం నాయకులు

**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ లోని వివిధ వార్డుల్లో కొలువున్న పీర్లను మొహరం నిర్వాహకుల సంఘం నాయకులు దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొహరం పీర్ల పండుగను తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ సాంస్కృతిక పండుగగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గతంలో పీర్ల చావిడికి మాన్యాలు ఉండేవని అటువంటి భూములన్ని అన్యాక్రాంతమైనావని తెలిపారు. పీర్ల పేరు మీద ఉన్న భూముల్ని ఆక్రమించుకున్న వారు పీర్ల పండుగ నిర్వహణ కొరకు ఎలాంటి డబ్బులు చెల్లించటం లేదని ఆవేదన చెందారు. పీర్ల మాన్యాలను అన్నిటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వాటిని పీర్ల పండుగ నిర్వహణ నిమిత్తం ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర తెలంగాణ సాంస్కృతిక పండుగలకు చెల్లిస్తున్న విధంగానే పీర్ల పండుగ నిర్వహణ కొరకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో పీర్ల చావిడీలు, మసీదులు సంచార వృత్తుల వారికి, ఇతర గ్రామాల నుంచి వచ్చిన బాటసారులకు నిలువ నీడ నిచ్చేటివని వారు తెలిపారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల పీర్ల మసీదులన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. పీర్ల మసీదుల మరమతులకు నిధులు కేటాయించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మహబూబ్నగర్ పట్టణంలోని బండ్ల గిరి, పాత





పాలమూరు జైలుకాన, ఏనుగొండ, పాన్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఉన్న పీర్లను దర్శించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొహరం నిర్వాహకుల సంఘం కన్వీనర్ జీ గట్టన్న, టీఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు పీ విజయకుమార్, సంఘం నాయకులు బాలకృష్ణ, జలాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల వసతి గృహాల పక్క భవనాలు పూర్తి చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** భారత విద్యార్థి సమాఖ్య ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ హాజరై మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ, బీసీ, కలశాల వసతి గృహాలు గత 5 సంవత్సరాల నుంచి నిర్మాణం పనులు జరుగుతున్నాయి కానీ ఇప్పటి వరకు పూర్తిచేసిన పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా అద్దె భవన్లో ఇరుకు గదుల్లో చాలి చాలని రూములో మరుగుదోడ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఎస్టీ కలశాల వసతి గృహం ఇప్పటి వరకు మంజూరు చెయ్యక విద్యార్థులు దిక్కు లేని పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతి గృహాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న విధంగా వసతి గృహాలు ఉన్నాయన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విద్యాశాఖ అధికారులు ఒక్క వసతి గృహాన్ని కూడా సందర్శించిన పరిస్థితి లేదు అని వాపోయారు. అదేవిదంగా ఇప్పటి వరకు విద్యార్థుల మెస్‌కి సంబంధించి మెనూ ప్రిపేర్ చేయలేక పోవటం వల్ల విద్యార్థులకు కనీసం రుచి కరమైన భోజనం అందించటం లేదు అని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పై సమస్యలు పరిష్కరించాలి అని ప్రభుత్వమును డిమాండ్ చేసారు. లేని యెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు నరేష్, స్వామి, ఈశ్వర్, ఆశ్విత్, శివ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టా పాస్ బుక్కుల ఆధారంగానే రుణమాఫీ



**విశ్వంభర, ఆమనగల్లు :** రైతుల పంట రుణాలు మాఫీ విషయంలో అనుమానాలు అపోహలకు తావు లేదని ఆమనగలు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతుల రూ. 2,00,000 పంట రుణాలు మాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కర్తల మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింహ, శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ.. రైతుల పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంగానే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని తెలిపారు. పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు నిబంధన ఏమీ లేదని కేవలం రైతు కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమే రేషన్ కార్డు నిబంధన పెట్టడం జరిగిందని వారు స్పష్టం చేశారు. విపక్షాలు రాజకీయ లబ్ధికోసం రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని వారి మాటలు నమ్మి అన్నదాతలు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈనెల 18వ తేదీ నుంచి రుణమాఫీ అమలు ప్రారంభమై ఆగస్టు 15 నాటికి పూర్తవుతుందని చెప్పారు. రుణమాఫీ సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయడం జరుగుతుందని నరసింహ, శ్రీనివాస్ రెడ్డిలు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తికాగానే రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతలకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ప్రజారంజక పాలన చూసి ఓర్వలేని విపక్షాలు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని నరసింహ, శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, జాంగిర్ అలీ, కృష్ణ తదితరులు ఉన్నారు.

## హక్కుల సాధనకు ఏకమవుదాం

**షాద్‌నగర్ ముదిరాజ్ సంఘం**

**విశ్వంభర, షాద్‌నగర్ :** తెలంగాణ రాష్ట్రా అసెంబ్లీ ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ముదిరాజ్‌లను బిసిడి నుంచి బీసీఏ కు మార్పును వెంటనే చేపట్టాలని కోరుతూ షాద్‌నగర్ ముదిరాజ్ సంఘం సభ్యులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే మండల రెవెన్యూ కార్యాలయంలోని డిప్యూటీ తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల హామీలలో భాగంగా తమకు ఇచ్చిన న్యాయమైన కోరికలను మాత్రమే తాము అడుగుతున్నామని, దీనికి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 1000 కోట్ల నిధులు మంజూరు చేయాలని, చెరువులు/కుంటలపై ముదిరాజు మరియు బెస్తల కులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా 75% సబ్సిడీతో రుణాలు మంజూరు చేయుటకు 1000 కోట్లు కేటాయించాలని కోరుతూ.. ఈనెల 15వ తేదీ సోమవారం నుండి 20వ తేదీ శనివారం వరకు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ముదిరాజ్ బిడ్డ పెద్ద ఎత్తున కదిలి ప్రతి మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాలు సమర్పించాలన్నారు.






## తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, కుల్కచర్ల :** మండల పరిధిలోని ముజాహిద్పూర్ గ్రామంలో ఆదర్శ పాఠశాల వసతి గృహంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఆ విషయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో మంగళవారం నూతన బోరు వేయించి విద్యార్థులకు తాగుగునీటి సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించారు. విద్యార్థులు, స్థానికులు ఎమ్మెల్యేపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, వార్డెన్ కల్పన, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్ర భూపాల్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నర్సరీ పరిశీలన



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం మంగళవారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ నర్సరీని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వెల్మినేటీ లోకేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఉపాధి హామీ సిబ్బందికి, నర్సరీ వనసేవకురాలీకి మొక్కలకు సంబంధించిన పలు సలహాలు సూచనలు చేశారు. అనంతరం వారు ఇంటింటికి మొక్కలను పంపిణీ చేయడానికి సన్నాహాలు చేపట్టాలని ఆదేశించారు. వారి వెంటా ఉపాధి హామీ ఏపీఓ బీ రమేశ్‌గౌడ్, టీఏ జే యాదిరెడ్డి, వనసేవకురాలు మంజుల, మహేశ్వరీ ఉన్నారు.

## అనుమాస్పద స్థితిలో మహిళా మృతి

**విశ్వంభర, షాద్‌నగర్ :** నియోజకవర్గం కేశంపేట మండలం పరిదిలోని వేముల్ నర్వ గ్రామ వేణుగోపాలస్వామి దేవస్థానం సమీపంలోని ముల్ల పొదల్లో మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభ్యమైంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దాదాపు నాలుగు రోజుల క్రితం ఈ మహిళ మృతి చెందినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మొఖం గుర్తుపట్టని స్థాయిలో పురుగులు పట్టి ఛిద్రమైనట్లు తెలిపారు. ఈ మహిళ ఎవరు ఎక్కడి నుంచి వచ్చింది ఇది హత్య, ఆత్మహత్య లేదా ఎక్కడైనా చంపి ఇక్కడికి తీసుకొచ్చి పడేశారా అన్న అనుమానం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు మృతికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

**కుమ్మరికుంట్ల గణేష్ మాదిగ**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో మంగళవారం రోజు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య ఆదేశాల మేరకు ఆత్మకూరు(ఎం)మండల విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కుమ్మరి కుంట్ల గణేష్ మాదిగ మాట్లాడుతూ.. మాదిగల ఓట్లపై ఉన్న శ్రద్ధ ప్రధాని మోడీకి ఎస్సీ వర్గీకరణపై లేదని అందుకోసం మాదిగల చిరకాల కోరికైనా ఎస్సీ వర్గీకరణ చేయకుండా మోసం చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయాలని, బిజెపి అధికారంలోకి వస్తే ఏబిసిడి వర్గీకరణ చేస్తా అని మాయ మాటలు చెప్పిన మోడీ ఇప్పటికీ మూడోసారి ప్రధానమంత్రి అయిన ఏబిసిడి వర్గీకరణ చేయలేదన్నారు. ఎలక్షన్లలో మాయమాటలు చెప్పి మాదిగలను మోసం చేస్తున్న మోడీని బిజెపి ప్రభుత్వాన్ని నిలతీయాలన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాలలో ఏబిసిడి వర్గీకరణ బిల్లు చట్టబద్ధత కల్పించాలని కోరారు. 19వ తారీఖున యాదగిరిగుట్టలో జరిగే రాష్ట్ర సదస్సును ఆత్మకూరు (ఎం) మండలం నుంచి ప్రతి గ్రామం నుండి మాదిగలు పెద్ద ఎత్తున తరలి వెళ్లి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కుమ్మరి కుంట్ల గణేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలం ఇంచార్జ్ మేడి శ్రీనివాస్ మాదిగ, పంది రవీందర్, నవీన్, వస్తువుల ఎల్లయ్య, మండల నాయకుడు మేడి చంద్రయ్య, మేడి బాలకృష్ణయ్య, మేడి నర్సింగరావు, కొమ్ము ముత్తయ్య, ఐలయ్య, ఎడ్ల సాయి బాబా తదిరులు పాల్గొన్నారు.




## నీట్ పేపర్ లీక్ కేసు.. కీలక నిందితుడ్ని అరెస్ట్ చేసిన సీబీఐ

**విశ్వంభర, ఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ అంశంపై సీబీఐ దర్యాప్తు వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో కీలక నిందితుడ్ని సీబీఐ నేడు అరెస్ట్ చేసింది. అతడి పేరు పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్య. పంకజ్ కుమార్ 2017 బ్యాచ్ జంషెడ్ పూర్ ఎన్ఐటీ విద్యార్థి. ఝార్ఖండ్ లోని హజారీ బాగ్ లో ఉన్న ఎన్టీయే (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) లాకర్ నుంచి నీట్ యూజీ ప్రశ్నాపత్రాన్ని అతడు చోరీ చేసినట్టు గుర్తించారు. బొకారో నివాసి అయిన పంకజ్ కుమార్ ను సీబీఐ అధికారులు పాట్నాలో అదుపులోకి తీసుకున్నారు. ప్రశ్నాపత్రం చోరీ చేసేందుకు అతడికి సహకరించిన మరో ఇద్దరి ని కూడా సీబీఐ అధికారులు హజారీ బాగ్ లో అరెస్ట్ చేశారు. తాజా అరెస్ట్ లతో కలిపి, నీట్ పేపర్ లీక్ లో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 14కి పెరిగింది.



## బడ్జెట్ సన్నాహాలు... హల్వా తయారుచేసిన కేంద్ర ఆర్థికమంత్రి

ఎన్డీయే 3.0 ప్రభుత్వం వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి పార్లమెంటు సమావేశాలు జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు నిర్వహించనున్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్2024 సన్నాహాలు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, సంప్రదాయం ప్రకారం పార్లమెంటులో నిర్మలా సీతారామన్ హల్వా తయారుచేశారు. ఆర్థిక శాఖ అధికారులకు, పార్లమెంటు సిబ్బందికి ఆమె స్వయంగా హల్వాను వడ్డించారు. ఈ కార్యక్రమం పార్లమెంటు నార్త్ బ్లాక్ లో నిర్వహించారు.



## చెవికి బ్యాండేజ్ తో పార్టీ కార్యక్రమానికి హాజరైన ట్రంప్

**అమెరికా:** రెండు రోజుల క్రితం అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. ర్యాలీలో ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలో ఒక యువకుడు ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ట్రంప్ చెవికి గాయమయింది. రెప్పపాటులో ట్రంప్ మృత్యువు నుంచి బయటపడ్డారు. మరోవైపు, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ను అధ్యక్ష అభ్యర్థిగా రిపబ్లికన్ పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, నిన్న రాత్రి జరిగిన పార్టీ జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. ట్రంప్ ను ఆడిటోరియంలోని స్క్రీన్ పై చూడగానే సభ్యులందరూ హర్షధ్వానాలు చేశారు. ట్రంప్ పేరుతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ట్రంప్ ఆడిటోరియంలోకి ప్రవేశించిన వెంటనే... 'గాడ్ బ్లెస్ ది యూఎస్ఏ' అనే పాటను గాయకుడు లీ గ్రీన్ వుడ్ ఆలపించారు. పాటను వింటూ ట్రంప్ చిరునవ్వులు చిందించారు. ఈ సమావేశానికి ట్రంప్ చెవికి బ్యాండేజ్ వేసుకుని వచ్చారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంకోవైపు, పెన్సిల్వేనియా సభలో తనపై కాల్పుల ఘటన జరిగిన తర్వాత మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ... కాల్పులు ఘటనలో తాను చనిపోవాల్సిన వాడినేనని అన్నారు. ఇలా మీ ముందు ఉండేవాడిని కాదని చెప్పారు. ఇదొక విచిత్రమైన పరిస్థితి అని వ్యాఖ్యానించారు.

# గుజరాత్‌లో విజృంభిస్తున్న చండీపుర వైరస్

**ఐదు రోజుల్లో ఆరుగురు చిన్నారుల మృతి**

**విశ్వంభర, సూరత్ :** అనుమానిత చండీపుర వైరస్‌తో గుజరాత్‌లో గత ఐదు రోజుల్లో ఆరుగురు చిన్నారులు మృత్యువాత పడినట్టు ఆ రాష్ట్ర ఆరోగ్య మంత్రి రుషికేశ్ పటేల్ తెలిపారు. చండీపుర వైరస్ కేసులు ఇప్పటి వరకు 12 నమోదు కాగా, అందులో నలుగురు ఒక్క సబరకాంత జిల్లాకు చెందినవారేనని మంత్రి పేర్కొన్నారు. మూడు కేసులు అరవల్లిలో నమోదు కాగా, మహీసాగర్, ఖేడాల్లో ఒక్కో కేసు వెలుగు చూసింది. రోగుల్లో ఇద్దరు రాజస్థాన్, ఒకరు మధ్యప్రదేశ్‌కు చెందినవారని పేర్కొన్నారు.

**నిర్ధారణ కోసం పూణేకు శాంపిళ్లు**

చనిపోయిన ఆరుగురి చిన్నారుల్లో ఐదుగురు సబరకాంత జిల్లాలోని హిమంతనగర్ సివిల్ ఆసుపత్రిలో మృతి చెందారు. రోగ నిర్ధారణ కోసం 12 శాంపిళ్లను అధికారులు పూణేలోని జాతీయ వైరాలజీ సంస్థ (ఎన్ఐవీ)కి పంపారు. జులై 10న నలుగురు చిన్నారులు మరణించారని, అందుకు కారణం చండీపుర వైరస్ అయి ఉంటుందని హిమంతనగర్ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు అనుమానిస్తున్నారు. ఇది అంటువ్యాధి కాదని మంత్రి పటేల్ తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో నిఘా పెట్టినట్టు పేర్కొన్నారు. 4,487 ఇళ్లలో 18,646 మందిని గుర్తించినట్టు చెప్పారు. వైరస్ ప్రబలకుండా ఆరోగ్యశాఖ అధికారులు 24 గంటలూ పనిచేస్తున్నట్టు వివరించారు.

**అసలేంటీ చండీపుర వైరస్**

చండీపుర వెసిక్యులోవైరస్‌నే చండీపుర వైరస్ (సీహెచ్‌పీవీ)గా పిలుస్తారు. ఈ వైరస్ రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినది. మహారాష్ట్రలోని చండీపురలో 1965లో దీనిని తొలిసారి గుర్తించారు. అందుకనే దీనికాపేరు వచ్చింది. దీనిబారిన పడిన చిన్నారుల్లో తీవ్రమైన మెదడువాపు (ఎన్సెఫలైటిస్) వస్తుంది. దోమలు, పేలు, ఇసుక ఈగల ద్వారా వ్యాపిస్తుంది.

**లక్షణాలు**

అకస్మాత్తుగా దీని లక్షణాలు కనిపించి త్వరగా పెరుగుతాయి. అధిక జ్వరం, తలనొప్పి, వాంతులు వంటివి కనిపిస్తాయి. ఈ వైరస్ సోకినవారు కొన్నిసార్లు కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యంగా పిల్లలు ఎక్కువగా దీనిబారిన పడే అవకాశం ఉంది. కాబట్టి లక్షణాలు కనిపించగానే గుర్తించి చికిత్స అందించడం ద్వారా బయటపడొచ్చు.



## ప్రొబేషనరీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ శిక్షణ రద్దు

**విశ్వంభర,ముస్సోరీ:** వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ శిక్షణ రద్దయింది. సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు నకిలీ అంగవైకల్య, ఓబీసీ సర్టిఫికేట్‌లను సమర్పించారనే ఆరోపణల నేపథ్యంలో శిక్షణను రద్దు చేస్తూ ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం పూజా ఖేద్కర్‌కు సమాచారం అందించింది. వివాదం నేపథ్యంలో సర్టిఫికేట్‌ను పరిశీలించాల్సి ఉందని, అందుకే తాత్కాలికంగా శిక్షణను రద్దు చేస్తున్నట్టు లేఖ రాసింది. జిల్లా శిక్షణా కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించామని, ఈ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వానికి కూడా సమాచారం అందించామని లేఖలో పేర్కొంది. తదుపరి చర్య కోసం వెంటనే అకాడమీకి రావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 23 జులై లోగా అకాడమీకి రావాలని మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొంది. కాగా ట్రైనీ ఐఏఎస్ అయిన పూజా ఖేద్కర్‌పై మరిన్ని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆగస్టు 2022లో పూణే జిల్లా పింప్రిలోని ఔంద్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తీసుకున్నట్టుగా ఆమె సమర్పించిన పాక్షిక 'లోకోమోటర్ వైకల్యం' సర్టిఫికేట్ ఫేక్ అని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు యూపీఎస్సీకి ఆమె అందజేసిన సర్టిఫికేట్‌లలో సరిగా కనిపించని వాటిపై విచారణ చేయబోతున్నట్టు పోలీసులు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా గతంలో అహ్మదనగర్ జిల్లా సివిల్ హాస్పిటల్ నుంచి తీసుకున్న పీడబ్ల్యూబీడీ కేటగిరి (పర్సన్స్ విత్ బెంచ్‌మార్క్ డిజేబిలిటీస్) సర్టిఫికేట్‌లను 2018, 2021లలో యూపీఎస్సీకి సమర్పించారు. అయితే ఆగస్టు 2022లో పూణేలోని ఔంధ్ ప్రభుత్వ ఆసుపత్రిలో అంగవైకల్య ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ వైద్య పరీక్షల అనంతరం దరఖాస్తును వైద్యులు తిరస్కరించారు. ఆమె అనుచిత ప్రవర్తన నేపథ్యంలో నకిలీ అంగవైకల్య సర్టిఫికేట్ విషయం తాజాగా వెలుగుచూడడం ఆమెను మరింత చిక్కుల్లో పడేసింది. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన 2023బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన పూజా ఖేద్కర్ పూణే కలెక్టర్ కార్యాలయంలో తనకు ప్రత్యేక అధికారాలు కావాలంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. తన సొంత కారుకు నీలిరంగు బుగ్గను కూడా బిగించుకున్నారు. మీడియాలో ఆమెపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఆమెను పూణే నుంచి బదిలీ చేసిన విషయం తెలిసిందే.




# సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జిల నియామకం

**విశ్వంభర, ఢిల్లీ :** సుప్రీంకోర్టుకు కొత్త జడ్జిలుగా జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్, జస్టిస్ ఆర్ మహదేవన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల మేరకు కొత్త న్యాయమూర్తులను నియమించామని, సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన అనంతరం నియమించామని పేర్కొన్నారు. కాగా వీరిద్దరికీ పదోన్నత కల్పిస్తూ ఇదివరకే సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. దీనికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్తగా చేరిన ఇద్దరు జడ్జిలతో కలుపుకొని సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి సహా మొత్తం జడ్జిల సంఖ్య 34కు చేరింది.

**మణిపూర్ నుంచి తొలి సుప్రీం జడ్జి**

ప్రస్తుతం జమ్మూ కశ్మీర్, లడఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ మణిపూర్ నుంచి సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మణిపూర్ మొదటి అడ్వకేట్ జనరల్ ఎన్ ఇబోటోంబి సింగ్ కుమారుడే జస్టిస్ కోటీశ్వర్ సింగ్. ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని కిరోరి మాల్ కాలేజ్ అండ్ క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రం చదివారు. 1986లో న్యాయవాదిగా కెరియర్ మొదలుపెట్టారు. జడ్జిగా పదోన్నత పొందడానికి ముందు మణిపూర్ అడ్వకేట్ జనరల్‌గా కూడా విధులు నిర్వర్తించారు. గౌహతి హైకోర్టు, మణిపూర్ హైకోర్టులలో పనిచేశారు.



**9 వేలకుపైగా కేసులు వాదించిన జస్టిస్ మహదేవన్**

ఇక జస్టిస్ మహదేవన్ విషయానికి వస్తే ప్రస్తుతం ఆయన మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. చెన్నైలో జన్మించిన ఆయన మద్రాసు లా కాలేజీలో చదువుకున్నారు. న్యాయవాదిగా 9,000లకు పైగా కేసులు వాదించారు. తమిళనాడు ప్రభుత్వానికి అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్‌గా(పన్నులు), మద్రాసు హైకోర్టులో భారత ప్రభుత్వానికి అడిషనల్ సెంట్రల్ గవర్నమెంట్ స్టాండింగ్ కౌన్సెల్‌గా, సీనియర్ ప్యానెల్ న్యాయవాదిగా కూడా పనిచేశారు. 2013లో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా ఆయనకు ప్రమోషన్ వచ్చింది.



## సేఫ్ జోన్ లోనూ బాంబుల వర్షం కురిపిస్తున్న ఇజ్రాయెల్

**విశ్వంభర,ఇజ్రాయెల్:** హమాస్ ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వేటాడుతున్న ఇజ్రాయెల్... తాజాగా సేఫ్ జోన్ లోనూ బాంబుల వర్షం కురిపించింది. సౌత్ గాజా నగరం ఖాన్ యూనిస్ శివారు ప్రాంతం మువాసీలో ఇజ్రాయెల్ భీకర దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 17 మంది మృతి చెందారు. హమాస్ పై ఇజ్రాయెల్ యుద్ధం ప్రకటించిన తర్వాత వేలాది మంది శరణార్థులు మువాసీ ప్రాంతానికి తరలివచ్చారు. ఈ ప్రాంతాన్ని ఇటీవలే సేఫ్ జోన్ల జాబితాలో చేర్చారు. అయితే, ఇజ్రాయెల్ అవేవీ పట్టించుకోకుండా, హమాస్ ఉగ్రవాదులను తుదముట్టించడమే లక్ష్యంగా దాడులు చేపట్టింది. మొత్తమ్మీద వివిధ ప్రాంతాల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కొన్ని గంటల వ్యవధిలోనే 60 మంది పాలస్తీనా వాసులు మృతి చెందారు. ఈ మేరకు గాజా హెల్త్ డిపార్ట్ మెంట్ వెల్లడించింది. గత శనివారం కూడా ఇజ్రాయెల్ ఇదే ప్రాంతంలో దాడులు చేపట్టగా, 90 మంది మరణించారు.

## అక్కడ.. రిజర్వేషన్లను లాక్కుని కాంగ్రెస్ ముస్లింలకు ఇచ్చింది : అమిత్ షా ఫైర్



**విశ్వంభర, హర్యానా:** ప్రతిపక్ష కాంగ్రెస్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హర్యానాలోని మహేంద్రగఢ్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. మహేంద్రగఢ్‌లో జరిగిన "బీసీ సమ్మాన్ సమ్మేళన్'లో ఆయన మాట్లాడుతూ.. ఇతర వెనకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించేందుకు 1950లలో ఏర్పాటు చేసిన కాకా కలేకర్ కమిషన్ గురించి అమిత్ షా ప్రస్తావించారు. కాంగ్రెస్ సంవత్సరాల తరబడి కమిషన్ సిఫారసులను అమలు చేయలేదని మండిపడ్డారు. 1980లో, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 'మండల్ కమిషన్'ని కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టారని, 1990లో దానిని ఆమోదించిన సమయంలో, రాజీవ్ గాంధీ రెండున్నర గంటలు ప్రసంగించి ఓబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించారని ఆయన గుర్తు చేశారు. కర్ణాటకలో వెనకబడిన వర్గాల రిజర్వేషన్లను లాక్కుని కాంగ్రెస్ ముస్లింలకు ఇచ్చిందని విమర్శించారు. హర్యానాలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇదే పరిస్థితి వస్తుందని ఆయన అన్నారు. హర్యానాలో ముస్లింలకు రిజర్వేషన్లు అనుమతించబోమని తాను హామీ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.హర్యానాలో పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు.ఈ ఏడాది చివర్లో హర్యానా అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్నాయి.

## పూరీ భాండాగారంలో మరో రహస్య గది?



**విశ్వంభర, పూరి :** ఒడిశాలోని పూరీ శ్రీక్షేత్ర రత్న భాండాగారాన్ని జులై 14వ తేదీన తెరిచిన విషయం తెలిసిందే. అయితే ఈ రత్న భాండాగారం దిగువన రహస్య గది ఉందని చరిత్రకారులు అంటున్నారు. సొరంగ మార్గం ద్వారా వెళ్లగలిగే ఆ గదిలో విలువైన సంపద దాచారని చెబుతున్నారు. 1902లో ఆంగ్లేయుల పాలనలో ఈ సొరంగ మార్గం అన్వేషణకు ప్రయత్నించి విఫలమైనట్లు తెలిపారు. రత్న భాండాగారం తెరిచి, సంపద లెక్కింపునకు శ్రీకారం చుట్టిన బీజేపీ ప్రభుత్వం.. సొరంగ మార్గం, రహస్య గదిని గుర్తించడంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. 'పూరీ రాజు కపిలేంద్రదేవ్ తూర్పు, దక్షిణ రాష్ట్రాలను జయించిన సమయంలో ఎనలేని సంపద తెచ్చి పురుషోత్తమునికి సమర్పించినట్లు చరిత్రలో ఉందని ప్రముఖ చరిత్రకారుడు నరేంద్రకుమార్ మిశ్ర తెలిపారు. తర్వాత పురుషోత్తందేవ్ హయాంలోనూ స్వామివారికి సంపద సమకూరిందని.. అప్పట్లో శ్రీక్షేత్ర భాండాగారం దిగువన సొరంగ మార్గం తవ్వి ఆభరణాలు భద్రపర్చడానికి రహస్య గది నిర్మించారని పేర్కొన్నారు. శ్రీక్షేత్రం ఆవరణలో రహస్య గదులు, మార్గాలు ఉన్నాయనడానికి ఆధారాలున్నా, వాటిని ఎవరూ కనుగొనలేకపోయారని దాస్ వివరించారు.

## సుఖేష్ చంద్రశేఖర్‌కు బిగ్ షాక్..

**26 లగ్జరీ కార్లను వేలం వేసేందుకు హై కోర్టు గ్రీన్ సిగ్నల్**

**విశ్వంభర, ఢిల్లీ:** మనీలాండరింగ్ కేసులో పట్టుబడి జైలులో ఉన్న సుఖేష్ చంద్రశేఖర్ కు ఢిల్లీ హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. ఈ కేసులో సుఖేశ్ కు సంబంధించిన 26 కార్లను వేలం వేసేందుకు.. ఈడీ అధికారులకు ఢిల్లీ హైకోర్టు అనుమతి ఇచ్చింది. మాజీ రెలిగేర్ ప్రమోటర్ మల్వీందర్ సింగ్ భార్యను మోసం చేసిన కేసులో ఈడీ సుకేష్ చంద్రశేఖర్‌ను ఫిబ్రవరి 16న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం అతన్ని కోర్టులో హాజరు పర్చగా మనీలాండరింగ్ కు పాల్పడినట్లు నేరం రుజువైంది. దీంతో అతను అప్పటి నుంచి జైలు జీవితం గడుపుతూ ఉన్నాడు. అంతేకాకుండా ఢిల్లీ లిక్కర్ స్కాం వెలుగులోకి రావడంలో కూడా ఇతను కీలక పాత్ర పోషించాడు.నేర కార్యకలాపాల ద్వారా ప్రతి సుకేశ్ చంద్రశేఖర్ రూ.వందల కోట్లు సంపాదించినట్లు ఈడీ ఆరోపించింది. ఈ క్రమంలోనే ఆయనకు చెందిన లగ్జరీ కార్లను విక్రయించేందుకు ఈడీ అనుమతి కోరగా ట్రయల్ కోర్టు గతంలో అనుమతించగా దీనిని సవాలు చేస్తూ సుకేశ్ భార్య లీలా పాలోస్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ స్వర్ణ కాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం.. వాహనాల భద్రత, జీవనకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వాటిని విక్రయించడమే ఉత్తమమని ఈడీకి ఆదేశాలు జారీ చేసింది.



# సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ భేటీ

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు క్యాబినెట్ ఆమోదం

- కొత్త ఇసుక విధానం అమలుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్
- ఈ నెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం



**విశ్వంభర,వెలగపూడి:** సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ముగిసింది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో పలు నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త ఇసుక విధానం అమలుకు ఆమోదం లభించింది. నూతన ఇసుక పాలసీ అమలు కోసం త్వరలోనే విధివిధానాలు రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. పౌరసరఫరాల శాఖ రూ.2 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారంటీకి ఆమోదం లభించింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ఎన్సీడీసీ నుంచి రూ.3,200 కోట్ల రుణానికి క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రుణం తీసుకునేందుకు వ్యవసాయ, సహకార కార్పొరేషన్ కు ప్రభుత్వ గ్యారంటీకి క్యాబినెట్ సమ్మతి తెలిపింది. కాగా, పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లింపు, విధివిధానాల ఖరారుకు కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ముగ్గురు మంత్రులతో కమిటీ నియమించారు. ఈ కమిటీలో అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్ ఉన్నారు. రెండ్రోజుల్లో చర్చించి, అధికారులతో మాట్లాడి ఒక నిర్ణయానికి రావాలని కమిటీని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రీమియం చెల్లింపు స్వచ్ఛందంగా రైతులు చేయాలా? లేక, ప్రభుత్వం చెల్లించాలా? అనే అంశాన్ని ఖరారు చేయాలని కమిటీకి నిర్దేశించారు. రెండ్రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇక, సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీలపై ప్రధానంగా చర్చ జరిగింది.ఇక, ఈ నెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నేటి క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు.

**ఉచిత ఇసుక పాలసీలో జోక్యం చేసుకుని చెడ్డ పేరు తెచ్చుకోవద్దు**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఢిల్లీ పర్యటనకు వెళుతున్నారు. ఈ మధ్యాహ్నం రాష్ట్ర క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం సీఎం చంద్రబాబు రాష్ట్ర మంత్రులతో రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ వెళుతున్నామని చెప్పారు. ఉచిత ఇసుక విధానంలో మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారు. ఉచిత ఇసుక విధానంలో జోక్యం చేసుకుని చెడ్డపేరు తెచ్చుకోవద్దని అన్నారు. అక్టోబరు తర్వాత ఇసుక్ రీచ్ లన్నీ అందుబాటులోకి వస్తాయని చంద్రబాబు వెల్లడించారు. డంప్ యార్డుల్లో 43 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని తెలిపారు. వచ్చే మూడు నెలల్లో 1 కోటి టన్నుల ఇసుక అవసరం ఉంటుందని అన్నారు.



## భూములు దోచుకున్నారని ఊరికే అనడం కాదు... ఆధారాలు చూపించండి: పేర్ని నాని

**విశ్వంభర, గుంటూరు:** ఎన్నికల ముందు తమపై ఏ విధంగా విషం చిమ్మారో, ఇప్పుడు కూడా టీడీపీ, దాని మిత్ర పక్షాలు అదే రీతిలో వ్యవహరిస్తున్నాయని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజమెత్తారు. బట్ట కాల్చి ముఖంపై వేసే వైఖరిని ఇంకా కొనసాగిస్తున్నారని విమర్శించారు. నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సహజ వనరుల దోపిడీ అంశంపై శ్వేతపత్రం విడుదల చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, పేర్ని నాని మీడియా సమావేశం ఏర్పాటు చేసి విమర్శనాస్త్రాలు సంధించారు. ఎంతో అనుభవం ఉందని మీరు చెప్పుకుంటున్నారు కదా... ఊరికే భూములు దోచుకున్నారని అనడం కాదు... మీలో ఖలేజా ఉంటే... ఆధారాలను ఈ సమాజం ముందు పెట్టండి అని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఏ దళితుల భూమిని ఏ ఎమ్మెల్యే, ఏ మంత్రి బదలాయించుకున్నాడో చెప్పాలి కదా అని నిలదీశారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, రెవెన్యూ శాఖ మీవే కదా... అధికారంలో ఉన్నది మీరే కదా... ఎందుకు నిరూపించలేకపోతున్నారు? అంటూ పేర్ని నాని మండిపడ్డారు. అధికారం కోసం ఐదు పదుల వయసున్న కుర్రాడితో పోటీ పడి, ఆ కుర్రాడ్ని నాశనం చేయడం కోసం విషం చిమ్మే దిక్కుమాలిన మార్గం ఎంచుకున్నారు అంటూ విమర్శించారు. అలవికాని హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయలేక ఈ 35 రోజుల్లో దిక్కులు చూడడం తప్ప మీరు చేస్తున్నదేంటి? అని పేర్ని నాని ప్రశ్నించారు.

## రాష్ట్రంలో 3,220 లెక్చరర్ పోస్టుల భర్తీ

- ఉన్నత విద్యపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమీక్ష
- న్యాయపరమైన చిక్కులు తొలగించి పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలన్న లోకేశ్
- పోస్టుల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని స్పష్టీకరణ



**విశ్వంభర, విజయవాడ:** ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేడు ఉన్నత విద్య అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 3,220 లెక్చరర్ పోస్టుల భర్తీ అంశంపై మంగళవారం సమీక్ష సమావేశంలో చర్చించారు. న్యాయపరమైన చిక్కులు తొలగించి పోస్టుల భర్తీకి కసరత్తులు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా పోస్టుల భర్తీ ప్రక్రియ ఉండాలని పేర్కొన్నారు. ఇక విద్యా దీవెన, వసతి దీవెన స్థానంలో పాత విధానం అమలు చేస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కు విధివిధానాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం రూ.3,480 కోట్ల మేర బకాయిలు ఇవ్వలేదని ఆరోపించారు. విద్యార్థుల సర్టిఫికెట్లు ఆయా సంస్థల్లో ఉండిపోయాయని వెల్లడించారు. గత ప్రభుత్వ విధానాలతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గడంపై మంత్రి నారా లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. కాలేజీల్లో డ్రగ్స్ అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని, అందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారుల నియామకాన్ని పరిశీలించాలని అధికారులకు స్పష్టం చేశారు. డ్రగ్స్ పై చైతన్యం కలిగించేందుకు స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకోవాలని అన్నారు.

## టీటీడీ జేఈవోగా వెంకయ్య చౌదరి నియామకం



**విశ్వంభర, తిరుమల:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన జేఈవోగా చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి నియమితులయ్యారు. ఆయన 2005 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి. వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్ పై పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో ఆయన డిప్యుటేషన్ పై ఏపీలో మూడేళ్ల పాటు పనిచేయనున్నారు. ఆయన గతంలో ఏపీ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండీగా పనిచేశారు.అటు, 2006 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణను కూడా కేంద్రం ఏపీకి పంపించింది. రవికృష్ణ ప్రస్తుతం కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోలో డిప్యూటీ డైరెక్టర్ గా ఉన్నారు. ఆకె రవికృష్ణ గతంలో కర్నూలు జిల్లా ఎస్పీగా వ్యవహరించారు. యూపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి ఏవీ రాజమౌళిని కూడా కేంద్రం ఏపీకి డిప్యుటేషన్ పై పంపింది. రాజమౌళి 201419లో ఏపీ సీఎంవోలో పనిచేశారు. తాజాగా, ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం ఆయనను రాష్ట్రానికి పంపేందుకు ఆమోదం తెలిపింది. రాజమౌళి ప్రస్తుతం యూపీ హోంశాఖ కార్యదర్శిగా ఉన్నారు.

## కొడాలి నానికి బిగ్ షాక్..గుడివాడలో ఆఫీస్ ఖాళీ?

**విశ్వంభర, గుడివాడ:** గుడివాడలో వైకాపా కార్యాలయం ఖాళీ చేయించింది థియేటర్ యాజమాన్యం. గుడివాడలోని శరత్ థియేటర్ కొన్నేళ్లుగా కొడాలి నాని అధ్వర్యంలో నడిచింది వైసీపీ గుడివాడ కార్యాలయం. అయితే_ _ _గత ఐదేళ్లుగా అధికారాన్ని అడ్డు పెట్టుకుని శరత్ థియేటర్ ను కొడాలి నాని ఆక్రమించుకున్నారని యాజమాన్యం ఆరోపణలు చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే శరత్ టాకీస్ ను స్వాదీనం చేసుకున్న యజమాన్యం. శరత్ టాకీస్ యాజమాన్యంలో ఒకరైన మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు టీ పార్టీకి హాజరయ్యారు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇతర టిడిపి నేతలు. అటు థియేటర్లో వైకాపా ఫ్లెక్సీలు_ _ _.కొడాలి నాని ఫోటోలను తొలగించింది థియేటర్ యజమాన్యం. ఈ సందర్భంగా థియేటర్ వాటాదారుడు యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఏళ్ల తర్వాత నా ఆస్తిని చూసుకునేందుకు వచ్చాను_ _ _.75% వాటా ఉన్న తాము_ _ _. తమ కష్టాన్ని ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయమని కోరామని తెలిపారు. మా భాగస్వామ్యులం హక్కుగా మా ఆస్తిని పరిరక్షించుకుంటాం_ _ _.తమ విజ్ఞప్తి మేరకు టీ పార్టీకి వచ్చిన ఎమ్మెల్యే రాముకు ధన్యవాదాలు అన్నారు.

## 'ఇంకోసారి వాడు, వీడు అని మాట్లాడు... నీ సంగతేంటో చూస్తా'



**విశ్వంభర, ఒంగోలు :** ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి ఈసారి టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ గెలుపొందగా, బాలినేని శ్రీనివాసరెడ్డి ఓడిపోయారు. తాజాగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం ముదిరింది. ఎన్నికల తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయిన బాలినేని తాజాగా ఒంగోలు వచ్చి కార్యకర్తలతో సమావేశమై టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పై మాటల తూటాలు పేల్చారు. ఏం... మేం చేతకానివాళ్లం అనుకుంటున్నావా... చెప్పుతో కొడతాం అంటూ నిన్న ఓ రేంజిలో విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో, బాలినేని వ్యాఖ్యలపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఘాటుగా స్పందించారు. నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరికే వదలం అంటూ హెచ్చరించారు. "జైలుకెళ్లినా రెండ్రోజుల్లో వస్తా, చూస్తా అంటున్నావు... నువ్వేం చూస్తావో మేం కూడా చూస్తాం. నువ్వు (అధికారంలో) ఉన్నప్పుడే పీకలేకపోయావు. ఇప్పుడేం పీకుతావో చూస్తా. కొన్ని మాటలు అనాలంటే సంస్కారం అడ్డొస్తోంది. వయసులో పెద్దవాడివి. ఇంకోసారి వాడు, వీడు అని మాట్లాడు నువ్వు... నీ కొవ్వు దించుతాను. ఏదో గమ్మున ఉంటున్నాం కదా అని రెచ్చిపోతున్నారా? అధికారం అడ్డంపెట్టుకుని నువ్వు, నీ కొడుకు ఎన్ని అరాచకాలు చేశారు? ఆసుపత్రిలో డబ్బులు వసూలు చేయలేదా? గ్రానైట్ లో డబ్బులు వసూలు చేయలేదా? ఒక్కో బార్లోకి వెళ్లి సీసాకు రూ.10 వసూలు చేయలేదా? వైశ్యులకు చెందిన కమర్షియల్ బిల్డింగ్ లకు డబ్బులు వసూలు చేయలేదా? నాకేం తెలియదు, నా కొడుక్కేం తెలియదు అని ఇప్పుడు మాట్లాడుతున్నారు. మీరు చేసిన పాపాలకు ప్రజలు బుద్ధి చెప్పారు. సంస్కారంతో మాట్లాడడం తెలుసుకో. వచ్చావా... కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పావా... అంత వరకే! ఎన్నికల్లో ఓడిపోయాక కార్యకర్తలకు ధైర్యం చెప్పకుండా ఎందుకు పారిపోయావు? కౌంటింగ్ రోజున మాకు ఇంకా సర్టిఫికెట్ ఇవ్వకముందే నువ్వు 4 గంటలకే వెళ్లి హైదరాబాదులో కూర్చున్నావు... నీలాంటి వాడిపై కార్యకర్తల్లో ఏం విశ్వాసం ఉంటుంది? ఇవాళ వచ్చి కార్యకర్తలకు అండగా ఉంటానని ఎలా చెబుతావు?" అంటూ దామచర్ల జనార్దన్ ధ్వజమెత్తారు.

## ఏపీ శాసనమండలి సెక్రటరీ జనరల్ గా సూర్యదేవర ప్రసన్నకుమార్



**విశ్వంభర, విజయవాడ:** ఏపీ శాసనమండలి సెక్రటరీ జనరల్ గా సూర్యదేవర ప్రసన్నకుమార్ ను ఏపీ ప్రభుత్వం నియమించింది. ఆయనను కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తూ శాసనమండలి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల సెక్రటరీ జనరల్ పదవికి రామాచార్యులు రాజీనామా చేయడం తెలిసిందే. రామాచార్యులు రాజీనామాతో ఏర్పడిన ఖాళీని ప్రసన్నకుమార్ నియామకంతో భర్తీ చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన సూర్యదేవర ప్రసన్న కుమార్ గతంలో సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ గా పనిచేశారు. లోక్ సభ స్పీకర్ కు ఓఎస్డీగా, ఢిల్లీ శాసనసభ కార్యదర్శిగా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయ ఓఎస్డీగా వ్యవహరించారు. ఈ ఏడాది జనవరిలో ఆయన తెలంగాణ అసెంబ్లీ సలహాదారుగా నియమితులయ్యారు.

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న శాంతి, మదన్ మోహన్ వీడియో



**విశ్వంభర, విశాఖపట్నం:** తన భార్య శాంతికి పుట్టిన బిడ్డకు తండ్రెవరో చెప్పాలంటూ మదన్ మోహన్ అనే వ్యక్తి గత కొన్నిరోజులుగా తీవ్ర ఆవేదన వెలిబుచ్చుతున్నారు. విజయసాయిరెడ్డిపై ఆయన సందేహాలు వ్యక్తం చేస్తుండడంతో ఈ వార్త వైరల్ అయింది. అయితే, ఇదంతా కుల మీడియా పనే అంటూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో తీర్పు చెప్పేది వాళ్లే, విచారణ జరిపేది వాళ్లే, సాక్షులు కూడా వాళ్లే అంటూ ఓ వర్గం మీడియాపై ఆయన కారాలు మిరియాలు నూరుతున్నారు. ఇక, అసలు విషయానికొస్తే... సోషల్ మీడియాలో శాంతి, ఆమె భర్త మదన్ మోహన్ లకు సంబంధించిన ఓ వీడియో వైరల్ అవుతోంది. అందాల ఆడబొమ్మ అనే పాట బ్యాక్ గ్రౌండ్ లో వస్తుండగా... శాంతి, మదన్ మోహన్ విశాఖ బీచ్ లో డ్యాన్స్ చేస్తుండడం ఆ వీడియోలో చూడొచ్చు.

## ఏపీలో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు



- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న ఏపీఎస్డీఎంఏ

**విశ్వంభర, విశాఖపట్నం :** అల్పపీడన ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కాగా, ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్రంలో రెండు మూడు చోట్ల అతి భారీ వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. నేడు అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ ఎస్డీఎంఏ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో దక్షిణ ఒడిశా తీరానికి ఆనుకుని అల్పపీడనం ఏర్పడిందని వివరించారు.

## నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో బాలికపై హత్యాచారం

- పార్కు సమీపంలో బాలికపై ముగ్గురు బాలురు అత్యాచారం చేశారన్న ఎస్పీ
- ఊరి బయటికి తీసుకెళ్లి బాలికను గొంతు నులిమి చంపారని వెల్లడి



**విశ్వంభర, నంద్యాల :** జిల్లాలోని ముచ్చుమర్రిలో వాసంతి అనే బాలిక హత్యకు గురవడం తెలిసిందే. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తాజాగా ఈ కేసుకు సంబంధించిన వివరాలు తెలిపారు. పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో చిన్నారి వాసంతిపై పార్కు సమీపంలో ముగ్గురు బాలురు అత్యాచారం చేశారని వెల్లడించారు. అనంతరం ఊరి బయటకు తీసుకెళ్లి బాలిక గొంతు నులిమి హత్య చేశారని వివరించారు. ఘటన తర్వాత ఈ విషయాన్ని నిందితులు తమ కుటుంబ సభ్యులు, బంధువులకు చెప్పారని ఎస్పీ వెల్లడించారు. దాంతో తమ పిల్లలను కాపాడుకునేందుకు నిందితుల్లో ఒకరి తండ్రి, మరొకరి పెదనాన్న రంగంలోకి దిగారని తెలిపారు.వారిద్దరూ బాలిక మృతదేహాన్ని బైక్ పై వనములపాడుకు తీసుకెళ్లారని, అక్కడ్నించి చిన్న తెప్పపై కృష్ణానదిలోకి తీసుకెళ్లి, మృతదేహానికి రాళ్లు కట్టి నదిలో పడేశారని వివరించారు. బాలిక మృతదేహం కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ముచ్చుమర్రి రాజకీయాలతో బాలిక వాసంతి హత్య ఘటనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. బాలురు ఓ యూట్యూబ్ వీడియో చూసి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు ఎస్పీ వివరించారు.

## ఢిల్లీ బయల్దేరిన ఏపీ సీఎం చంద్రబాబు



**విశ్వంభర, గన్నవరం :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు బయల్దేరారు. రాష్ట్ర, ప్రజా ప్రయోజనాల కోసమే ఢిల్లీ వెళుతున్నానని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రానికి చాలా అవసరాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కేంద్రం సహకారం ఎంతో ముఖ్యమని, కేంద్రం అండతో అన్నీ సాకారం చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు, ఏపీ క్యాబినెట్ భేటీ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీకి రావడానికి పరిశ్రమలు ఆసక్తిగానే ఉన్నా, భూతం భయం ఇంకా పోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్ల, స్వేచ్ఛగా బతుకుతున్నామనే భావనకు ప్రజలు వచ్చారని తెలిపారు. వైసీపీ ప్రచారం చేసే ఫేక్ న్యూస్ లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో స్కిల్ సెన్సస్ (నైపుణ్య గణన) ప్రారంభించామని చంద్రబాబు వెల్లడించారు.

# లండన్‌లో కోహ్లీ అనుష్క.. 'శ్రీ రామ్ జై రామ్' అంటూ!



**విశ్వంభర, స్పోర్ట్స్** : లండన్‌లో కోహ్లీ అనుష్క.. 'శ్రీ రామ్ జై రామ్' అంటూ ప్రత్యక్షమయ్యారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రస్తుతం తన ఫ్యామిలీతో హాలిడే ట్రిప్ లో ఎంజాయ్ చేస్తున్నారు. టీ20 వరల్డ్ కప్ ముగిసిన తర్వాత ముంబైలో విజయ పరేడ్ లో పాల్గొన్న కోహ్లీ.... ఆ మరుసటి రోజు లండన్ కు చేరుకున్న సంగతి తెలిసిందే. తాజాగా కోహ్లీ గురించి అతని భార్య అనుష్క శర్మ అప్డేట్ ఇచ్చారు.విరాట్ కోహ్లీ, అతని భార్య అనుష్క శర్మ శనివారం లండన్ లో అమెరికన్ గాయకుడు కృష్ణదాస్ కీర్తనకు హాజరైనట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా 'శ్రీ రామ్ జై రామ్' అని పఠిస్తూ కనిపించారు విరాట్ కోహ్లీ, అతని భార్య అనుష్క శర్మ యూనియన్ చేపల్ లో జరిగిన కార్యక్రమానికి ఇద్దరు హాజరయ్యారు. ఈ ఫంక్షన్ కు సంబంధించిన ఫోటోను అనుష్క శర్మ ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. ఈ వీడియోలో విరుష్క జోడి ఈ కీర్తనలు వింటూ ఎంజాయ్ చేస్తున్నారు.

## శ్రీలంక టూర్ లో టీమ్ఇండియాకు ఇద్దరు కెప్టెన్లు?



**విశ్వంభర, స్పోర్ట్స్** : టీ20 ప్రపంచకప్, జింబాబ్వే సిరీస్‌లో విజయాలతో టీ మిండియా జోరు మీద ఉంది. రానున్న టోర్నీల్లోనూ మరింత మెరుగ్గా పర్ఫామ్ చేయాలని ప్లేయర్లు ఆసక్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో రానున్న శ్రీలంక టూర్ కోసం తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అక్కడ టీమ్ఇండియా మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుండగా.. జులై 26 నుంచి టీ20 సిరీస్, ఆగస్టు 1 నుంచి వన్డే సిరీస్ మొదలవ్వనుంది. అయితే ఈ సిరీస్ కు టీమ్ఇండియా కెప్టెన్‌గా ఎవరు రానున్నారన్న విషయంపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇందులో భాగంగా స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా పేరు గట్టిగా వినిపిస్తోంది. గతంలోనూ టీమ్ఇండియాకు సారథిగా ఉన్న అనుభవం ఉండటంతో కెప్టెన్సీ లిస్ట్‌లో హార్దిక్ పేరు ముందున్నట్లు తెలుస్తోంది. వన్డే కెప్టెన్సీ ఫార్మాట్‌కు కేఎల్ రాహుల్ లేదా.. శ్రేయాస్ అయ్యర్ ఈ సిరీస్‌లో కమ్ బ్యాక్ ఇచ్చే ప్లాన్స్‌లో ఉన్నందున అతడికి కెప్టెన్సీ బాధ్యతలు ఇవ్వనున్నట్లు సమాచారం. ఇక భారత కోచ్‌గా గౌతమ్ గంభీర్ ప్రయాణం కూడా ఈ సిరీస్‌తోనే మొదలవుతుంది.

# రింకూ సింగ్‌కి టెస్టుల్లో కూడా చోటివ్వాలి..

- మాజీ బ్యాటింగ్ కోచ్ ఆసక్తికర వ్యాఖ్యలు



**విశ్వంభర, స్పోర్ట్స్** : టీమిండియా యంగ్ బ్యాట్స్‌మెన్ రింకూ సింగ్‌కి భారత్ టెస్టు క్రికెట్ జట్టులోనూ చోటు ఇవ్వాలని, టెస్టుల్లో ఆడే టెక్నిక్ అతడికి ఉందని భారత మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్ అభిప్రాయపడ్డాడు. టెస్టులు ఆడే టెక్నిక్ అతడి బ్యాటింగ్‌లో ఉందని, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతడి సగటు 50కిపైగా ఉందని ప్రస్తావించాడు. "నేను నెట్స్‌లో రింకూ సింగ్ బ్యాటింగ్‌ను గమనించినప్పుడు అతడు టెస్ట్ బ్యాటర్ కాకపోవడానికి సాంకేతిక కారణాలు ఏంటో నాకు అర్థం కాలేదు. టీ20 క్రికెట్‌లో అతడు అద్భుతమైన ఫినిషర్‌గా పేరు తెచ్చుకున్నాడని నాకు తెలుసు. అయితే అతడి ఫస్ట్‌క్లాస్ రికార్డును పరిశీలిస్తే 50 సగటుతో ఆడాడు. అతడు మెరుగయ్యేలా కనిపిస్తున్నాడు. కాబట్టి ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అతడికి అవకాశం ఇస్తే టెస్ట్ క్రికెటర్‌గా కూడా రాణించగలడు" అని విక్రమ్ రాథోర్ అన్నారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. ఇక రింకూ సింగ్‌తో పాటు యంగ్ క్రికెటర్లు అయిన శుభ్‌మాన్ గిల్, యశస్వి జైస్వాల్‌లను కూడా అన్ని ఫార్మాట్లలోకి తీసుకోవచ్చని అభిప్రాయపడ్డాడు. అద్భుతమైన ఆటగాళ్లు వెలుగులోకి వస్తున్నారని, అయితే గిల్, జైస్వాల్ మూడు ఫార్మాట్లలో ఎక్కువ కాలం ఆడేలా కనిపిస్తున్నారని, రాబోయే సంవత్సరాల్లో వీరిద్దరూ భారత బ్యాటింగ్‌కు వెన్నెముకగా మారబోతున్నారని రాథోర్ అభిప్రాయపడ్డారు.

**రింకూ సింగ్ ట్రాక్ రికార్డు ఇదే**

రింకూ సింగ్ ఇప్పటివరకు భారత్ తరపున 2 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. టీ20లల రింకూ సింగ్ స్ట్రైక్‌రేట్ 176.27గా ఉంది. ఇక 15 మ్యాచ్‌ల్లో 83.2 సగటుతో 416 పరుగులు బాదాడు. జట్టులో ఫినిషర్ పాత్రను పోషిస్తున్నాడు. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో కూడా ఆడాడు. జూన్ నెలలో వెస్టిండీస్, అమెరికాల వేదికగా జరిగిన టీ20 ప్రపంచ కప్ జట్టులో రిజర్వ్ ఆటగాడిగా కూడా ఉన్న విషయం తెలిసిందే. ఇక ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో రింకూ సింగ్ ఇప్పటివరకు 47 మ్యాచ్‌లు ఆడాడు. 7 సెంచరీలు, 20 అర్ధసెంచరీలతో కలుపుకొని 54.7 సగటుతో మొత్తం 3,173 పరుగులు సాధించాడు. కాగా భారత బ్యాటింగ్ కోచ్‌గా రాథోర్ పదవీకాలం టి20 ప్రపంచ కప్‌తో ముగిసిపోయింది.

# సొంతూరులో హార్దిక్ పాండ్యాకు గ్రాండ్ వెల్ కమ్



**విశ్వంభర, స్పోర్ట్స్** : తాజాగా జరిగిన టీ 20 ప్రపంచకప్‌లో టీమ్ఇండియా జయకేతనం ఎగురవేసిన విషయం తెలిసిందే. ఈ విజయం అభిమానులకే కాదు క్రికెటర్లకు ఎంతో ముఖ్యమైంది. దీంతో అటు ప్లేయర్లు కూడా క్రికెట్ అభిమానులు భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సూపర్ విక్టరీని సెలబ్రేట్ చేసుకున్నారు. ఇక టీమిండియా ప్లేయర్లకు ఇప్పటికే భారత అభిమానులు నీరాజనాలు పట్టిన విషయం తెలిసిందే. మరోవైపు తమ సొంత ఊర్లకు వెళ్లిన ప్లేయర్లకు అక్కడి వారు గ్రాండ్‌గానే వెల్‌కమ్ చెబుతున్నారు.తాజాగా టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాకు కూడా తన సొంత ఊరు అయిన వడోదరలో ఘన స్వాగతం లభించింది. తమ అభిమాన క్రికెటర్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున ఫ్యాన్స్ తరలివచ్చారు. ఓపెన్ బస్‌లో అందరికీ అభివాదం చేస్తూ ఎయిర్‌పోర్ట్ నుంచి ర్యాలీగా తన ఇంటికి చేరుకున్నాడు హార్దిక్. ఈ ర్యాలీ తర్వాత వడోదరలో హార్దిక్‌కు సన్మానం ఏర్పాటు చేశారు. ఈ వీడియోను పాండ్యా తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో షేర్ చేశాడు. తనకోసం ఈ ఏర్పాటు చేసిన అభిమానులకు ధన్యవాదాలు తెలిపాడు.

# 'వయసు మోసం' చేశాను

- అంగీకరించిన భారత మాజీ క్రికెటర్ అమిత్ మిశ్రా



**విశ్వంభర, స్పోర్ట్స్** : ఐపీఎల్‌లో ప్రస్తుతం లక్నో సూపర్ జెయింట్స్‌కు ఆడుతున్న భారత మాజీ క్రికెటర్, స్పిన్ బౌలర్ అమిత్ మిశ్రా ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టాడు. వయసు విషయంలో తాను మోసానికి పాల్పడ్డానని, 2003లో భారత జట్టులోకి అరంగేట్రం చేసినప్పుడు తన వయసును ఒక ఏడాది తగ్గించుకుని చూపించానని వెల్లడించాడు. అప్పుడు తన వయస్సు 22 సంవత్సరాలైతే 21 ఏళ్లుగా తప్పుదోవ పట్టించానని ఒప్పుకున్నాడు. తన కోచ్ సలహా మేరకు ఈ విధంగా వ్యవహరించినట్టు చెప్పాడు. శుభంకర్ మిశ్రా పోడ్‌కాస్ట్‌లో అమిత్ మిశ్రా ఈ విషయాలను బయటపెట్టాడు.వయసు తక్కువగా చూపించాలనే ఆలోచన తనకు రాలేదని, తన కోచ్ ఇంటికి పిలిచి మరీ చెప్పారని అమిత్ మిశ్రా ప్రస్తావించాడు. కోచ్ ఈ విషయాన్ని చెప్పినప్పుడు తాను చాలా ఆశ్చర్యపోయానని, ఎలా సాధ్యమని ప్రశ్నించానని, అయితే వయసు తగ్గించుకునేందుకు ఒప్పుకున్నానంటూ గుర్తుచేసుకున్నాడు. ఇది చాలా భావోద్వేగ కథ అని, ఆ రోజు నుంచి తాను ఒక సంవత్సరం చిన్నవాడిని అయ్యానని చెప్పాడు. కాగా అమిత్ మిశ్రా ప్రస్తుతం ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకడిగా ఉన్నాడు.

**రోహిత్ శర్మతో జరిగిన సంభాషణ ఇదే..**

కాగా ఐపీఎల్ 2024లో స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ, మిత్ మిశ్రా మధ్య వయసుకు సంబంధించి సరదా సంభాషణ జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారిన నేపథ్యాన్ని ప్రశ్నించగా పాడ్‌కాస్ట్‌లో అమిత్ మిశ్రా స్పందించారు. "నాకు నిజంగా 41 ఏళ్లేనా అంటూ రోహిత్ శర్మ ప్రశ్నించాడు. మేము చెడ్డీలు వేసుకున్నప్పుడు అరంగేట్రం చేశావ్ ఇంకా 41 ఏళ్లేనా? అని సరదాగా అన్నాడు. అవును 2021 ఏళ్లప్పుడు చేసి ఉంటానని చెప్పాను. ఆ తర్వాత నీకు నిజంగా 74 ఏళ్లేనా అని రోహిత్‌ను అడిగాను. అతడు బిగ్గరగా నవ్వుతూ ఇక మాట్లాడొద్దు అన్నాడు. ముంబై ఇండియన్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ మధ్య మ్యాచ్ సందర్భంగా ఇద్దరి మధ్య ఈ సరదా సంభాషణ జరిగింది" అని అమిత్ మిశ్రా వెల్లడించాడు.

## వరుసగా మూడో రోజు లాభాల్లో

# ముగిసిన మార్కెట్లు




**విశ్వంభర, బిజినెస్:**

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాల్లో ముగిశాయి. ఈ ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు మధ్యలో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. చివరకు మళ్లీ కొనుగోళ్లు జరగడంతో లాభాల్లో ముగిశాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 52 పాయింట్లు లాభపడి 80,717కి చేరుకుంది. నిఫ్టీ 26 పాయింట్లు పుంజుకుని 24,613 వద్ద స్థిరపడింది. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 83.58గా ఉంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**

హిందుస్థాన్ యూనిలీవర్ (2.70%), భారతి ఎయిర్ టెల్ (2.00%), టెక్ మహీంద్రా (1.13%), ఇన్ఫోసిస్ (1.09%), మహీంద్రా అండ్ మహీంద్రా (0.95%).

**టాప్ లూజర్స్:**

కోటక్ బ్యాంక్ (2.11%), ఎన్టీపీసీ (1.35%), రిలయన్స్ (1.32%), అల్ట్రాటెక్ సిమెంట్ (1.23%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (0.42%).

# వర్షంలో ఈవీ కారును చార్జ్ చేయవచ్చా?

**విశ్వంభర, బిజినెస్ :**

ప్రపంచవ్యాప్తంగా ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం విపరీతంగా పెరిగింది. ఈవీ కార్లతో పోల్చుకుంటే ఈవీ బైక్స్, స్కూటర్లు ఎక్కువ మంది ప్రజలు వినియోగిస్తున్నారు. అయితే పెరిగిన టెక్నాలజీతో ఇటీవల కాలంలో పెట్రో కార్లతో పోటీగా ఈవీ కార్లు మైలేజ్ ఇవ్వడంతో ఆ కార్ల అమ్మకాల సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ అమ్మకాలు పెరిగినా సగటు ఈవీ కార్ల వినియోగదారులను కొన్ని అనుమానాలు వేధిస్తున్నాయి. అందులో మొదటిది బ్యాటరీ చార్జింగ్. బ్యాటరీ అనేది ఈవీ కారు నడవడానికి ముఖ్యమైన పార్ట్. అయితే ఆ బ్యాటరీను వర్షం పడుతున్న సమయంలో చార్జ్ చేయవచ్చా..? అని ఇటీవల కాలంలో చాలా ఈవీ కార్ల యూజర్లు గూగుల్ రివ్యూలను చదువుతూ ఉన్నారు. ముఖ్యంగా లాంగ్ రైడ్‌కు వెళ్లిన సమయంలో అనుకోని పరిస్థితుల్లో ఇరుక్కుపోతే ఆ సమయంలో వర్షం పడితే ఈవీ కారు చార్జింగ్ అనేది పెద్ద ప్రహసనంగా మారుతుంది. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో ఈవీ కారు నిర్వహణ అంటే ముఖ్యంగా బ్యాటరీ నిర్వహణ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. కొంతకాలం క్రితం వరకు ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కార్లు మాత్రమే వాడేవారు. కానీ ఎలక్ట్రిక్ కార్ల ట్రెండ్ కూడా చాలా తక్కువ సమయంలో వేగంగా పెరుగుతోంది. పెట్రోల్, డీజిల్ కార్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ కార్లను ఛార్జ్ చేయడం కష్టం. వర్షాకాలంలో వాటిని ఛార్జ్ చేయడం మరింత కష్టం అవుతుంది. కానీ కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ కారును సులభంగా ఛార్జ్ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా కంపెనీ తన ఎలక్ట్రిక్ కారును మార్కెట్లోకి విడుదల చేసినప్పుడు అనేక దశల్లో టెస్టింగ్ చేస్తారు. ఆ తర్వాత మాత్రమే కారు మార్కెట్లోకి విడుదల చేస్తారు. వాహన తయారీదారులు ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఛార్జర్లు, కనెక్టర్లను అన్ని రకాల వాతావరణంలో పని చేసేలా తయారు చేస్తారు. దీనితో పాటు, వాటి నాణ్యత కూడా మెరుగ్గా ఉంచుతారు. ఈవీ ఛార్జర్‌లు, కనెక్టర్‌లు పూర్తిగా వాటర్‌ప్రూఫ్‌గా ఉంటాయి, దీనితో పాటు, వాటిని దుమ్ము, మట్టి లేదా ఇతర రకాల కణాల నుండి రక్షించడానికి ప్రత్యేక సాంకేతికత ఉపయోగిస్తారు. ఎలక్ట్రిక్ కార్లలో, ఛార్జర్ వాటర్ ప్రూఫ్‌తో పాటు, ఆన్‌బోర్డ్ సెన్సార్ల ద్వారా భద్రత కూడా రెట్టింపు అవుతుంది. కొన్ని కారణాల వల్ల ఛార్జర్‌లో సమస్య ఉన్నప్పటికీ అది పరిష్కరించకపోతే కారులో అమర్చిన ఆన్‌బోర్డ్ సెన్సార్లు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తాయి. అయితే మీరు మీ కారును ఛార్జ్ చేయాలనుకుంటే డ్రైవింగ్ చేసిన వెంటనే కారును ఛార్జింగ్‌లో ఉంచవద్దని గుర్తుంచుకోండి. ఎందుకంటే డ్రైవింగ్ చేయడం వల్ల బ్యాటరీ ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఛార్జింగ్‌లో ఉంచడం వల్ల దాని ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. అలాగే వర్షాకాలంలో, ఛార్జర్‌పై నేరుగా నీటి చుక్కలు పడని ప్రదేశంలో కారును పార్క్ చేసి ఛార్జ్ చేయడానికి ప్రయత్నించడం మేలు. కవర్ పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేసిన తర్వాత కారును ఛార్జ్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



## ఆర్థిక వృద్ధిరేటులో తగ్గేదేలే..

# దూసుకుపోతున్న భారత్




**విశ్వంభర, బిజినెస్** : భారతదేశ ఆర్థిక వృద్ధిరేటు ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటులో సగం వాటాను కలిగి ఉండే అవకాశం ఉందని వరల్డ్ ఎకానమిక్ అవుట్ లుక్ ప్రొజెక్షన్ తెలిపింది. 2024 సంవత్సరానికి గానూ ఇండియా, చైనా వృద్ధి ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగం వాటాను సాధించినట్లు వెల్లడించింది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థతో గణనీయమైన మార్పులు చోటు చేసుకోనున్నట్లు ప్రముఖ ఎకనామిస్ట్, తొలి ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ తెలిపారు. ప్రపంచ వృద్ధి ఏప్రిల్ 2024లో వరల్డ్ ఎకనామిక్ ఔట్ లుక్ అంచనాలకు అనుగుణంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2024 నాటికి 3.2 శాతం వృద్ధి రేటు ఉండగా.. అదే 2025నాటికి 3.3 శాతంకు చేరుకుంటుందని ఈ నివేదికలో వెల్లడించింది. ఉత్పత్తి సేవలకు సంబంధించిన ద్రవ్యోల్బణంపై పురోగతి సాధిస్తుందని అంచాలు వేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న వాణిజ్య అవసరాలు, కంపెనీల పాలసీ విధానంలో మార్పులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నట్లు తెలిపారు గీతా గోపీనాథ్. ఈ కంపెనీ పాలసీలు పెరిగిన ద్రవ్యోల్బణాన్ని స్థిరంగా ఉంచేందుకు దోహదపడుతుందంటున్నారు. తద్వారా ఆర్థిక వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వివిధ దేశాలకు సంబంధించిన వృద్ధి రేట్లను ఎక్స్ ఖాతాలో పొందుపరిచారు. వీటిని పరిశీలిస్తే గత ఏడాదికి, ప్రస్తుతానికి, రానున్న ఏడాదికి సంబంధించి మార్పులు ఉన్నట్లు తెలుస్తోంది.

# బడ్జెట్‌లో నిర్మలమ్మ పద్దుపైనే ఆశలన్నీ..!




**విశ్వంభర, బిజినెస్** : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ఏడవ బడ్జెట్‌ను జూలై 23న సమర్పించనున్నారు. మోదీ 3.0లో ఎన్‌డీఏ ప్రభుత్వం మొదటి సారి ప్రవేశపెడుతున్న పూర్తి స్థాయి బడ్జెట్ ఇది. రాబోయే ఐదేళ్లలో తన విజన్‌తో పాటు సంస్కరణల ఎజెండాను ఏ విధంగా నిర్వహించాలని యోచిస్తోందో? తెలిపే కీలక బడ్జెట్ ఇదేనని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. చాలా మంది నిపుణులు బడ్జెట్ విధాన కొనసాగింపు, ఆర్థిక ఏకీకరణపై బలమైన దృష్టిని సూచిస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం తన ఎఫ్‌వై 25 ఆర్థిక లోటు లక్ష్యాన్ని మధ్యంతర బడ్జెట్‌లో నిర్ణయించిన 5.1 శాతం నుంచి జీడీపీలో 5 శాతం తగ్గించే అవకాశం ఉందని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ 2024పై నిపుణుల అంచనాల ప్రకారం ఏయే రంగం ఎలాంటి మినహాయింపులను ఆశిస్తుందో? ఓ సారి తెలుసుకుందాం.

**సామాజిక రంగం**

ప్రభుత్వం గ్రామీణ రంగ పథకాలపై వ్యయాన్ని పెంచే అవకాశం ఉంది. గృహాలకు రాయితీలు రూ. 23,000 కోట్లు పెంచే అవకాశం ఉంది. అలాగే గ్రామీణ రహదారులు, ఉపాధి కోసం ఖర్చులు పెంచుతారని, ముఖ్యంగా పబ్లిక్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్‌ను రూ. 12,100 కోట్లు ఖర్చు చేయడంతో పాటు మహిళల ఆర్థిక సాధికారత కార్యక్రమాన్ని విస్తరిస్తారని వివరిస్తున్నారు.

**తయారీ రంగం**

దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టిని పెట్టే అవకాశం ఉంది. ఈ బడ్జెట్‌లో పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ కోసం కనీస స్థానిక కంటెంట్ ఆవశ్యకతలో పెరుగుదలను ప్రకటించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. కొత్త ఉత్పాదక సౌకర్యాల కోసం 15 శాతం రాయితీ కార్పొరేట్ పన్ను రేటును పునరుద్ధరిస్తారని అంచనా వేస్తున్నారు. ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ వాల్యూ చైన్ ఇంటిగ్రేషన్ చుట్టూ 2019 జాతీయ విధానాన్ని సవరించవచ్చు. అలాగే ఉత్పత్తి లింక్డ్ ఇన్సెంటివ పథకాన్ని ఎలక్ట్రానిక్ భాగాలతో పాటు ఎంఎస్ఎంఈలకు అనుసంధానం చేసే అవకాశం ఉంది.

**మౌలిక సదుపాయాల రంగం**

పబ్లిక్ క్యాపెక్స్‌పై దృష్టి కేంద్రీకరించడం ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలో కీలకమైన సిద్ధాంతంగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. మధ్యంతర బడ్జెట్‌లో సమర్పించబడిన జీడీపీలో 3.4 శాతం నుంచి జీడీపీలో 3.5 శాతానికి ప్రభుత్వం తన మొత్తం క్యాపెక్స్ వ్యయాన్ని డయల్‌అప్ చేయాలని భావిస్తున్నారు. రాష్ట్రాల డిమాండ్ల దృష్ట్యా, ప్రభుత్వం మౌలిక సదుపాయాల వ్యయం కోసం 50 సంవత్సరాల వడ్డీ రహిత రుణం కింద బదిలీ చేసి, ఎలాంటి షరతులు లేకుండా ఆ మొత్తాన్ని పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**వినియోగం రంగం**

కొత్త పన్ను విధానంలో పన్ను చెల్లింపుదారులకు ప్రామాణిక మినహాయింపు పరిమితిని పెంచడం ద్వారా వినియోగదారుల డిమాండ్‌ను పెంచుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో బ్యాంకు వడ్డీ నుంచి వచ్చే ఆదాయంపై మినహాయింపును పెంచే అవకాశం ఉంది. ఇతర చర్యలు రూ. 515 లక్షల పన్ను శ్లాబ్‌లో ఉన్నవారికి వ్యక్తిగత ఆదాయపు పన్ను రేటును తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. రైతులకు ప్రస్తుతం ఉన్న రూ.6,000 నుంచి రూ.8,000గా పెంచే అవకాశం ఉందని వివరిస్తున్నారు.

# టాలీవుడ్ పైనే ఫోకస్ పెడుతోన్న బాలీవుడ్ హాట్ బ్యూటీ

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హిందీలో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేసింది. కానీ అక్కడ సాలిడ్ హిట్ మాత్రం అందుకోలేకపోయింది ఈ హాట్ బ్యూటీ. ఇక ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ లోకి అడుగు పెట్టడానికి రెడీ అవుతుంది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న దేవర సినిమాలో జాన్వీ హీరోయిన్ గా నటిస్తుంది. ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతోన్న దేవర సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమా తర్వాత రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న సినిమాలోనూ జాన్వీ హీరోయిన్ గా ఎంపికైంది. బుచ్చి బాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలో జాన్వీ హీరోయిన్ గా చేస్తుంది. ఈ సినిమా ఇటీవలే పూజా కార్యక్రమాలు జరుపుకుంది. ఇదిలా ఉంటే జాన్వీ కపూర్ ఇప్పుడు మరో తెలుగు సినిమాలో నటించే అవకాశం అందుకుందట. ఆహీరో ఎవరో కాదు నేచురల్ స్టార్ నాని. అవును నాని హీరోగా నటిస్తున్న నయా మూవీలో ఈ బాలీవుడ్ బ్యూటీ హీరోయిన్ గా చేస్తుందని టాక్ వినిపిస్తుంది. నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఓ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్ గా జాన్వీ కపూర్ ను ఎంపిక చేశారట. నాని, శ్రీకాంత్ ఓదెలా కాంబినేషన్‌లో వచ్చిన దసరా సినిమా ఏ రేంజ్ లో హిట్ అయ్యిందో అందరికి తెలుసు.






## ధనుష్ రాయన్ ట్రైలర్ రిలీజ్ చేసిన మేకర్స్

ధనుష్ హీరోగా తెరకెక్కుతోన్న 50వ సినిమా రాయన్.ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్నారు.ఈ సినిమాలో సందీప్ కిషన్ ,దుసారా విజయన్, కాళిదాస్ జయరామ్, ఎస్.జె.సూర్య, అపర్ణ బాలమురళి ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో చిత్రం విడుదల కానుంది.నార్త్ చెన్నై కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే... తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రేలర్ ను మేకర్స్ విడుదల చేశారు.రాయాన్ లుక్లో ధనుష్ రక్తంతో తడిచిన చేతితో పిడికిలి బిగించి భీకరంగా కనిపిస్తు చేతిలో కత్తులు ఉండటంతో అంచనాలు పెరుగుతూ ఉన్నాయి. దీంతో ఈ మూవీ విడుదల కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ లో రెహమాన్ తనదైన రస్టిక్ స్టైల్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ అదిరిపోయింది.

## 50 రోజుల్లో బిగ్‌బాస్ సీజన్ 8 మొదలు




బుల్లితెర రియాలిటీ షో బిగ్‌బాస్ మళ్ళీ వచ్చేస్తుంది. తెలుగులో కూడా ఈ రియాల్టీ షో బాగానే సక్సెస్ అయింది. ఇప్పటికే 7 సీజన్లు పూర్తిచేసుకోగా త్వరలో 8వ సీజన్ రాబోతుంది. ఇప్పటికే బిగ్ బాస్ అభిమానులు 8వ సీజన్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే బిగ్‌బాస్ తెలుగు సీజన్ 8 త్వరలోనే, మరో 50 రోజుల్లోనే మొదలు కానుందని సోషల్ మీడియాలో నిన్నటి నుంచి వైరల్ అవుతుంది. సెప్టెంబర్ 1 ఆదివారం నుంచి బిగ్‌బాస్ సీజన్ 8 మొదలవుతుందని టాక్ నడుస్తుంది. ఇప్పటికే పలువురు కంటెస్టెంట్స్ ని ఫైనల్ చేసారని కొంతమంది పేర్లు కూడా వినిపిస్తున్నాయి. యాంకర్ రీతూ చౌదరి, వేణుస్వామి, నయని పావని, జబర్దస్త్ అప్పారావు, కుమారి ఆంటీ, ఓ సెలబ్రిటీ కపుల్.. ఇలా పలువురి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ఎంతవరకు నిజమనేది షో మొదలయ్యేవరకు తెలీదు. అధికారికంగా బిగ్‌బాస్ నుంచి మాత్రం ఎలాంటి ప్రకటన రాలేదు. ఎన్టీఆర్, నాని, నాగార్జున ఇప్పటివరకు బిగ్‌బాస్ కి హోస్ట్ లుగా వ్యవహరించారు. గత అయిదు సీజన్ల నుంచి మాత్రం నాగార్జునే హోస్ట్ గా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఈ సారి కూడా నాగార్జుననే హోస్ట్ గా ఉండబోతున్నారని తెలుస్తుంది. మరి ఈ సారి ఎవరెవరు బిగ్‌బాస్ హౌస్ లోకి వస్తారో, ఎలాంటి టాస్కులు చేస్తారో, ఈ షోతో ఎంతమంది సెలబ్రిటీలుగా మారతారో చూడాలి. అయితే గత సీజన్ వివాదాల మయంగా నిలిచి సీజన్ విన్నర్ పల్లవి ప్రశాంత్ ని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

## 50 రూపాయలకే సినిమా చూడొచ్చు




పలు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా నటించిన వినోద్ కిషన్ పేకమేడలు సినిమాతో హీరోగా పరిచయమవుతున్నాడు. నటుడు రాకేష్ వర్రే క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో పేకమేడలు సినిమా తెరకెక్కింది. వినోద్ కిషన్ హీరోగా అనూష కృష్ణ, రితిక శ్రీనివాస్, జగన్ యోగి రాజ్, అనూష నూతల, గణేష్ తిప్పరాజు, నరేన్ యాదవ్.. పలువురు ముఖ్య పాత్రల్లో నటించారు. ఇప్పటికే పేకమేడలు సినిమా నుంచి టీజర్, సాంగ్స్, ట్రైలర్ రిలీజ్ చేసి మంచి అంచనాలు నెలకొల్పారు. పనిపాట లేకుండా జీవితంలో పగటి కలలు కంటూ భార్య సంపాదన మీద బతికే ఓ వ్యక్తి జాబ్ లో జాయిన్ అయి అక్కడ ఒక అమ్మాయి పరిచయమయితే తన లైఫ్ ఎలా మారింది? భార్యాభర్తల మధ్య గొడవలు ఎందుకొచ్చాయి అనే ఆసక్తికర కథని కామెడీ, ఎమోషనల్ గా చూపించబోతున్నారు. ఈ పేకమేడలు సినిమాకు ప్రమోషన్స్ కొత్తగా చేస్తున్నారు. ఈ సినిమా జులై 19న రిలీజ్ కాబోతుంది. అయితే ఇటీవల కొన్ని సినిమాలు రిలీజ్ కి ముందే పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్న సంగతి తెలిసిందే. సినిమా టికెట్స్ 200 నుంచి 500 ఉన్న సమయంలో పేకమేడలు సినిమా పెయిడ్ ప్రీమియర్ ని కేవలం 50 రూపాయలకే అందిస్తున్నారు. నేడు, రేపు, ఎల్లుండి.. సినిమా రిలీజ్ ముందు రోజు వరకు విజయవాడ, వైజాగ్, హైదరాబాద్ లాంటి సిటీల్లో పలు చోట్ల ప్రీమియర్ షోలు వేస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం రిలీజ్ కి ముందే 50 రూపాయలకే పేకమేడలు సినిమా చూసేయండి. ఇప్పటికే కొన్ని ప్రీమియర్స్ మొత్తం సేల్ అయిపోయాయి కూడా.



## మార్ ముంత చోడ్ చింతా అంటూ రచ్చ..రచ్చ!

చాక్లెట్ బాయ్ రామ్ పోతినేని ఊరమాస్ క్యారెక్టర్‌తో మెప్పించిన సినిమా ఇస్మార్ట్ శంకర్. ఈ సినిమా వసూళ్లలో.. రికార్డులు బద్దలు కొట్టిన విషయం తెలిసిందే. రామ్ కెరీర్‌లోనే బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌గా డబుల్ ఇస్మార్ట్‌గా వస్తున్నాడు రామ్. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ సైలెంట్ గా పూర్తి చేశారు. ఈ చిత్రం మార్చ్ లోనే విడుదల కావాల్సి ఉంది. అయితే మరికొంత షూటింగ్ అండ్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా బ్యాలన్స్ ఉండడంతో ఈ చిత్రం విడుదల తేదీని పోస్ట్ పోన్ చేశారు. కానీ మళ్ళీ ఎప్పుడు విడుదల చేస్తారనే విషయాన్ని మాత్రం ఇంకా ప్రకటించలేదు. ఇక ఈ చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని రామ్ పోతినేని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలోనే... ఈ సినిమా నుంచి ఓ మాస్ సాంగ్ వచ్చింది. మార్ ముంత చోడ్ చింతా అంటూ సాగే... సాంగ్ ప్రోమోను రిలీజ్ చేశారు. ఈ పూర్తి పాటను రేపు సాయంత్రం 4 గంటలకు రిలీజ్ కానుంది.

# రెండే రెండు ఖర్జూరాలతో ఫుల్ ఎనర్జీ



ఖర్జూరాల్లో ఎన్నో పోషకాలు, ఔషధగుణాలు దాగున్నాయి.. అందుకే ఆరోగ్యానికి మేలు చేసే ఖర్జూరాను ప్రతీరోజూ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్రమంతప్పకుండా ప్రతీరోజూ రెండు ఖర్జురాలు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని చెబుతున్నారు. ఖర్జూరాలోని సెలీనియం, మాంగనీస్, మెగ్నీషియం, కాపర్ వంటి పోషకాలతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఖర్జూరంలో ఐరన్, ఫోలేట్, ప్రొటీన్, ఫైబర్, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి 6 వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే.. ఉదయం లేవగానే ఖర్జూరాలను తీసుకుంటే ఎప్పుడూ ఫిట్‌గా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. అందుకే.. ఇన్ని పోషకాలతో కూడిన ఖర్జూరం ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుందని.. రోజూ ఒకట్రెండు ఖర్జూరాలు తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

**ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు..**

ఖర్జూరంలో కరిగే, కరగని ఫైబర్‌లు పుష్కలంగా ఉంటాయి.. ఇవి జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. మంచి ప్రేగు కదలికను ప్రోత్సహించడం ద్వారా ఖర్జూరాలు మలబద్ధకం వంటి సమస్యలను నివారించడంలో కూడా సహాయపడతాయి.

- ఖర్జూరంలో గ్లూకోజ్, సుక్రోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు ఉంటాయి. ఇవి శక్తిని, సామర్థ్యాన్ని పెంచుతాయి. కాబట్టి, ఉపవాస సమయంలో ఖర్జూరం తినమని సలహా ఇస్తారు.
- ఖర్జూరంలో పొటాషియం ఎక్కువగానూ, సోడియం తక్కువగానూ ఉంటాయి. ఇది నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.. ఇంకా గుండెను ఆరోగ్యంగా ఉంచి స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
- ఖర్జూరాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.
- ఖర్జూరంలో ఐరన్ ఎక్కువగా ఉండటం వల్ల రక్తహీనత చికిత్సలో ఇది సమర్థవంతమైన ఔషధం అని వైద్య నిపుణులు చెబుతున్నారు.
- ఖర్జూరాలు మీ మొత్తం ఆరోగ్యానికి, లైంగిక ఆరోగ్యానికి ప్రయోజనం చేకూర్చే పోషకాలతో నిండి ఉన్నాయి. ఈ పండ్లలో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్త ప్రవాహాన్ని, సామర్థ్యాన్ని మెరుగుపర్చి లైంగిక సమస్యలను నివారిస్తాయి.



# మీ ఇంటిని ఇలా క్లీన్ చేస్తే.. ఎలాంటి కీటకాలు ఇంట్లోకి రావు

వర్షా కాలం అంటేనే వ్యాధుల కాలం అని చెప్పొచ్చు. అంతే కాకుండా క్రిమి, కీటకాలు, పురుగులు కూడా ఇంట్లోకి ఎక్కువగా వస్తాయి. వీటి వల్ల అనేక ఇబ్బందులు వస్తూ ఉంటాయి. అనారోగ్య సమస్యలు ఎక్కువగా ప్రబలే అవకాశాలు ఎక్కువ. ఇంట్లో ఉండే ఆహారంపై వాలి.. వైరస్, బ్యాక్టీరియాలను స్ప్రెడ్ చేస్తాయి. ముఖ్యంగా ఇంట్లో చిన్నారులు ఉంటే మరింత జాగ్రత్త తప్పనిసరి. వారు అన్ని రకాల వస్తువులను పట్టుకుని నోట్లో పెట్టుకుంటారు. చిన్నారుల్లో ఇమ్యూనిటీ తక్కువగా ఉంటుంది. కాబట్టి త్వరగా జబ్బుల బారిన పడుతూ ఉంటారు. కాబట్టి ముందు ఇంటిని క్లీన్‌గా ఉంచుకోవడం అవసరం. ఇల్లు క్లీన్‌గా ఉంటే కీటకాలు, పురుగులు ఇంట్లోకి రాకుండా ఉంటాయి. ఇంటికి క్లీన్ చేసేటప్పుడు ఈ సారి ఈ చిట్కాలను ట్రై చేయండి. మరి అవేంటో ఇప్పుడు చూద్దాం.

**మిరియాలు:**

మిరియాలను మనం ఆహారంగా తీసుకుంటాం. ఇందులో అనేక రకాలైన పోషకాలు ఉంటాయి. ఇవి శరీరంలో ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తాయి. ముఖ్యంగా వర్షా కాలంలో మిరియాలతో తయారు చేసే ఆహారాలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటాయి. ఇంటిని కడిగే సమయంలో లేదా మాప్ పెట్టేటప్పుడు మిరియాలను కూడా ఉపయోగించవచ్చు. మిరియాలను మెత్తగా పొడిలా తయారు చేసి.. మాప్ పెట్టే నీటిలో కలపండి. మిరియాల నుంచి వచ్చే ఘాటు వాసనకు ఇంట్లోకి సూక్ష్మ క్రిములు, పురుగులు, కీటకాలు రాకుండా ఉంటాయి. అంతే కాకుండా బొద్దింకలు, పురుగులు, ఈగలు కూడా పారిపోతాయి.

**బేకింగ్ సోడా – వెనిగర్:**

బేకింగ్ సోడా, వెనిగర్స్‌ని మనం చాలా రకాల కిచెన్ హ్యాక్స్ కింద ఉపయోగించుకోవచ్చు. మురికిని వదిలించడంలో ఇవి ఎంతో చక్కగా సహాయ పడతాయి. అంతే కాకుండా వీటితో ఇంట్లోకి కీటకాలను కూడా రాకుండా చేయవచ్చు. బేకింగ్ సోడా, వెనిగర్ సమ పాలల్లో తీసుకుని బకెట్ నీటిలో వేయాలి. బాగా కలిపి ఇంటిని తుడిచినా, కడిగినా ఇంట్లోకి పురుగులు, కీటకాలు, సూక్ష్మ క్రిములు రాకుండా ఉంటాయి. అంతే కాకుండా ఇల్లు కూడా ఎంతో నీటిగా ఉంటుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com